ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 11 | సంచిక : 4 | డిసెంబరు 2005

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 28
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥100/-
విడి ప్రతి : రూ॥ 5/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ..................... 16-10-05
కైకలూరు ..................... 20-10-05
పాలకొల్లు ..................... 27-10-05

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## అహంకారము

దేహముతో తాదాత్మ్యము చెందే 'నేను' అను ప్రథమతలంపే అహంకారము. విభిన్నముగా గోచరించు ఈ జగత్తుకు బీజము అహంకారమే! ఈ అహంకారము వల్ల ఉదయించే 'నేను-నాది' అను భావన ద్వారా అంతులేని దుఃఖసాగరములో పడుచున్నాము. 'నేను' అను మూల-తలంపు పైనే సమస్త సృష్టి ఆధారపడియున్నది, అట్టి మూల తలంపు నశిస్తే అసలు సృష్టే లేదు.

**'నేను' బంధములో ఉన్నాను.**

**'నేను' ముక్తిని పొందాలి.**

**'నేను' పరమాత్మను తెలుసుకోవాలి.**

వీటిలో 'నేను' అనేదే మూల-తలంపు, ఆ నేను నశిస్తే, ఉన్నదే బ్రహ్మము, ఉన్నదే మోక్ష స్థితి. అహంభావన వల్లనే అఖండము, శుద్ధము, సత్యము అయిన కేవల చైతన్యము జీవుడు, జగత్తు, ఈశ్వరుడుగా గోచరిస్తోంది. వాస్తవముగా సాధన ద్వారా మనము విడుదల పొందవలసింది మూల తలంపు నుండేగాని, పరిసరములనుండి సమాజమునుండి, విధులనుండి కాదు. నాలో ఏదో ప్రత్యేకత ఉందను కోవడం వల్ల అహంకారము, పరిమిత బుద్ధి పెరుగుతాయి. అహంభావన, స్వార్థము ఈ రెండే మనకు ఎక్కువ దుఃఖాన్ని తీసుకొస్తాయి. వాస్తవముగా ఈ సృష్టి బ్రహ్మము యొక్క ప్రతి రూపమే! కాని మన అహంకారము వలన ఈ జగత్తును బ్రహ్మము కన్న వేరుగా భావిస్తున్నాము,

అట్లు భావించుట వలన బ్రహ్మము చైతన్య స్వరూపమైతే, జగత్తు జడమవు తుంది. ఆత్మ లేక స్వరూపము శుద్ధ చైతన్యము, అట్టి ఆత్మ కన్న భిన్నముగా రెండవ వస్తువునకు అనగా అహంకారమునకు ఉనికియే లేదను సంగతి అర్థమైతే భేదబుద్ధి నశించి ఆత్మ బుద్ధి కలుగుతుంది. అదియే 'తత్త్వమసి' అను మహా వాక్య సారము.

చావలి సూర్యనారాయణ మూర్తి
టీచర్, అమలాపురం

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-10-05, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఉన్నదంతా భగవంతుడే, అంతా ఆయన చేతిలోనే ఉంది. ఈ శరీరం ఎక్కడ జన్మించాలి, ఎప్పుడు మరణించాలి, ఈ శరీరం ఏ ప్రారబ్ధం అనుభవించాలి ఇవిఅన్నీ మనచేతిలో లేవు, భగవంతుడి చేతిలో ఉంది. అందుచేత కోరికలు లేకుండా మన పని మనం శ్రద్ధగా చేసు కొంటూపోవాలి. సంతోషం, దుఃఖం, ద్వేషం, వైరం ఇవి ఏమీ పనికిరావు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ రోజూ దుఃఖంలో ఉండకండి. మీరు ఇతరులను భయపెట్టవద్దు, ఇతరులను చూసి మీరు భయపడకండి, ఈరకంగా జీవించేవాడు నాకు ఇష్టుడు, నా దయకు పాత్రుడు అవుతాడు అని పరమాత్మ చెపుతున్నాడు. మనస్సు పూర్తిగా అణిగిపోతే భగవంతుడు చెప్పిన విషయాలు స్పష్టంగా మనకు అవగాహనలోనికి వస్తాయి, మనకు భగవదనుభవం కలుగుతుంది. ప్రారబ్ధాన్ని బట్టి దేహం వస్తుంది, అది ఎప్పుడు జన్మించాలో, ఎప్పుడు మరణించాలో అది నీచేతిలో లేదు. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తుంది. మనస్సులో వచ్చే వికారములను మోయకుండా, అది తీసుకొని వచ్చే అలజడిని పట్టించుకోకుండా, ఇవిఅన్నీ జీవలక్షణాలు అని గుర్తించి, ఎవడైతే నా పాదాలను ఆశ్రయిస్తున్నాడో వాడికి నా దయ కలుగుతుంది అని పరమాత్మ గీతలో చెప్పాడు. మనం ఏదైనా సాధించాలి అనుకొన్నప్పుడు అది చాలా నెమ్మదిగా వస్తుంది, దానికి ప్రిపరేషన్ అవసరం. మనం ఇల్లు కట్టాలి అనుకొన్నప్పుడు దానికి సిమ్మెంట్, ఐరన్, ఇటుకలు ఇవి అన్నీ కావాలి, దానికి ఎంతో కొంత పని ఉంటుంది, కొంత టైము పడుతుంది కదా. అలాగే నీవు ఆత్మజ్ఞానం పొందటానికి కొంత ప్రిపరేషన్ అవసరం, దానికి కొంత టైము పడుతుంది, నీవు తప్పనిసరిగా

పొందుతావు కాని నీవు శాంతి, ధైర్యం ఈ రెండూ విడిచిపెట్టకుండా సాధన చేయాలి. అప్పడు నీవు పొందవలసింది పొందుతావు, దానికోసం వేగిరపడకూడదు. మన చేతిలో ఉన్న పనిని అంకితభావంతో, హృదయ పూర్వకంగా, కపటం లేకుండా చేయాలి. మన స్వభావం ఎలా ఉంది అని మన గురించి మనం విచారణ చేసుకోము, ఇతరులు ఎటువంటివారు అని వారి గురించి విచారణ చేస్తాము, అదే మాయ. పోనీ వారు ఎటువంటివారో అంచనావేసే శక్తి మనకు ఉందా అంటే అదీ లేదు, మంచిని చెడ్డ అనుకొంటాము, చెడ్డను మంచి అనుకొంటాము. ఉన్న దానిని లేదు అనుకొంటాము, లేనిదానిని ఉంది అనుకొంటాము. మనకు ఏది మంచో, ఏది చెడ్డో తెలియటం లేదు. ఎదుటి మనిషిని మీరు కరెక్టుగా అంచనా వేయగలిగితే మీరు తెలివైనవారు అంటారు, కాని దానివలన మీకు కలిసివచ్చేది ఏమీలేదు, ఎదుటివాడి గురించి తెలుసుకోవటానికి మీరు చేసే ప్రయత్నం, మీ గురించి మీరు తెలుసుకోవటానికి చేస్తే మహాజ్ఞాని అవుతారు. మీ శక్తిని ఎందుకు వ్యర్థం చేసుకొంటారు. నీ స్వరూపం ఏమిటో నీవు తెలుసుకొంటే, నీవు ఎలా బాగుపడాలో నేర్చుకొంటే నీవు మహాజ్ఞానివి అవుతావు కదా! అయితే మనకు అదీ చేతకాదు, ఇదీ చేతకాదు.

కోరిక వలన మనకు దుఃఖం వస్తుంది, ఏ రకమైన కోరిక లేకపోతే దుఃఖం లేదు. అందరితోను మంచిగా ఉండవచ్చు, మనకు చేతనయితే సహకారం చేయవచ్చు, సంఘ దోషం పనికిరాదు. అంటే మనస్సుతో ఎవరితోను అనుబంధం పెట్టుకోకూడదు. ఒక్క భగవంతుడితో తప్పించి, ఎవరితో మానసిక అనుబంధం పెట్టుకున్నా మీరు, ఎత్తుకు ఎత్తు దుఃఖం అనుభవించవలసిందే. సంఘదోషం దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. శత్రువులు, మిత్రులు నిజంకాదు. ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు. మిత్రులపట్ల అతిగా ఉండవద్దు, శత్రువుల పట్ల వైరభావం వద్దు. నీవు సమానంగా ఉండటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే మనస్సు పల్చబడి రాలిపోతుంది. అందరిలోను నేను ఉన్నాను, అందరిలో ఉన్న నన్ను ఆరాధిస్తూ ఉంటే, నన్ను స్మరిస్తూ ఉంటే ఈ రాగద్వేషముల నుండి విడుదల పొందుతావు అని పరమాత్మ చెపుతున్నాడు. తమోగుణం, రజోగుణం తగ్గించుకొని సత్వగుణాన్ని పెంచు కోవటానికి ప్రయత్నం చెయ్యి. సత్వగుణం పెంచుకోవటానికి తపస్సు అవసరం. స్వార్థం లేకుండా నీవు ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము. మన యజమాని, మనలను

నియమించేవాడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు, ఆయనను ఎవడైతే చూస్తున్నాడో వాడు నిజమైన చూపులు కలవాడు. మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నా ఆయన మనకు అందటం లేదు. ఎందుచేతనంటే మనకు ఉన్న రూపభావన వలన, నామభావన వలన ఆయన మనకు గోచరించటం లేదు. నేను ఆపని చేసాను, ఈపని చేసాను అని ఆరోపించుకొనే గుణాలు మనకు ఉన్నాయి. రూపభావనను, నామభావనను, ఈ ఆరోపించుకొనే గుణాలను ప్రక్కన పెడితే లోపలఉన్న వస్తువు నీకు గోచరిస్తుంది.

నీవు తరించాలంటే అభ్యాసం, వైరాగ్యం విడిచిపెట్టవద్దు, సత్వగుణాన్ని అభివృద్ధి చేసుకో. నిన్ను బంధించే గొలుసు నీ అహంకారమే అని మర్చిపోతున్నావు. దేహభావన నిన్ను బంధిస్తోంది. నీవు జపం చేసినప్పుడు, ధ్యానం చేసినప్పుడు నీకు తాత్కాలికంగా శాంతిగా ఉన్నట్లు అనిపించినా, దేహంతో తాదాత్మ్యం పొందే బుద్ధి లోపల ఉన్నప్పుడు మరల దుఃఖం వచ్చేస్తుంది. భగవంతుని మాటలను ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే మనం ధర్మమార్గంలో ఉన్నట్లు గుర్తు. మనం ధర్మమార్గంలో ఉంటే అర్థ, కామాలే కాదు మోక్షం కూడా సిద్ధిస్తుంది, శాశ్వతమైన శాంతి లభిస్తుంది. మనకు రోగం వచ్చినప్పుడు మందులు మింగుతాము. ఆ రోగం తగ్గకపోతే డాక్టరు దగ్గరకు వెళ్ళి మీ మందులు పనిచేయలేదు అని చెపుతాము. అలాగే మీరు జపం చేసినప్పుడు, ధ్యానం చేసినప్పుడు మీ మనస్సు చల్ల బడుతోందా? లేదా? బుద్ధికి సూక్ష్మత వస్తోందా? లేదా? మన మాట చల్లగా ఉందా? లేదా? మనకు మారుమనస్సు కలుగుతోందా? లేదా? అని చూసుకోవాలి. మనం ఎన్ని మందులు మింగినా రోగం తగ్గకపోతే ఎలా ఉంటుందో, అలాగే మనం ఎన్ని సాధనలు చేసిన మన లోపల మార్పు రాకపోతే అదే గతి పడుతుంది. ఎవడైనా నిన్ను స్తోత్రం చేసినా, నిన్ను నిందించినా నీ మనస్సులో చాపల్యం లేదు అనుకో, నీ నిదానంలో నువ్వు ఉన్నావు అనుకో అప్పుడు నీవు భగవంతుడి దయకు పాత్రుడవుతావు. మనస్సును ఎలా నిగ్రహించాలో తెలుసుకొన్నాక, మనస్సును నిగ్రహించటానికి ప్రాక్టీసుచేయాలి కదా. ప్రాక్టీసుచేయటం మానేసి, జీవిస్తూ ఉంటే ఏదో రోజు శరీరానికి మరణం వస్తుంది, ఇంక మనోనిగ్రహం ఎలా కలుగుతుంది. ఇది మంచి అని మనం అనుకొన్నప్పుడు దానిని ప్రాక్టీసుచేయటం నేర్చుకోవాలి. సాధన లేకుండా సిద్ధి కలుగదు. దేవాలయానికి వెళ్ళినప్పుడు మాకు భక్తి, జ్ఞాన, వైరాగ్యములు

ప్రసాదించు అని భగవంతుడిని మనలో ఎంతమంది అడుగుతున్నాము. ఈవేళ పచ్చగా ఉండి, రేపు ఎండిపోయే వాటిని మనం అడుగుతాము. మనకు ఏది మంచిదో తెలియని పరిస్థితిలో ఉన్నాము.

ఆత్మజ్ఞానసముపార్జనలో నేను ప్రయాణించే మార్గం సరిగా ఉందా? లేదా? ఆ తపన, వివేకం ఉందా? లేదా? అది మీరు అనుగ్రహించండి అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. నీకు ఉన్న భక్తి నిజమైతే, ఆ తపన నిజమైతే నీ తపనే నీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది అంటున్నారు భగవాన్. మన కోరికను బట్టి ఏదీ రాదు, మన అర్హతను బట్టి యోగ్యతను బట్టి వస్తుంది. నీకు అధికారం వచ్చే యోగ్యత ఉంది అనుకో, ధనం వచ్చే యోగ్యత ఉంది అనుకో అది నీ కోరికతో సంబంధం లేకుండా వస్తుంది. భగవంతుడికి పక్షపాతం లేదు, నీ అర్హతను బట్టి ఇస్తాడు, ఒకరు అంటే ఇష్టం, ఒకరు అంటే అయిష్టం ఆయనకు లేదు. ఎవడి సహాయం వలన నీ ఇంద్రియాలు, బుద్ధి పనిచేస్తున్నాయో వాడిని నీ ఇంద్రియాలు, బుద్ధి తెలుసుకోలేవు. ఇవి అణిగిపోతే అది తెలియబడుతుంది. అది తెలుసుకొనే వస్తువుకాదు, అది తెలియబడు తుంది. చంటిపిల్లవాడి చేతిలో ఏదైనా వస్తువు ఉంది అనుకోండి. వాడికి ఇవ్వటం ఇష్టం లేకపోతే ఆ పిల్లవాడి దగ్గర నుండి వస్తువును తీసుకోలేము. వాడికి ఇవ్వాలని బుద్ధి కలిగింది అనుకోండి మనం చేయి చాపిన వెంటనే ఇచ్చేస్తాడు. దేవుడు కూడా అంతే. నాకు మోక్షం ఇయ్యి అంటే ఆయన ఇవ్వడు. మనకు అర్హత కలిగినప్పడు ఆయనే ఇస్తాడు. నీ మనస్సు భక్తిలో కరిగిపోయేటంత తీవ్రంగా దానిని కాంక్షించాలి. మనకు అరుణాచలం అంటే ఇష్టం అనుకోండి, మన మనస్సు దానిని అంటిపెట్టుకొని ఉండాలి. అరుణాచలాన్ని స్మరించగా స్మరించగా మనస్సు యొక్క చాపల్యం ఆగిపోయి అది అణిగిపోతుంది.

మీరు శారీరక బాధను అనుభవించగలరు కాని మానసిక అశాంతిని భరించలేరు. శారీరక బాధకంటే మనస్సులో వచ్చే అశాంతి భరించటం చాలా కష్టం. మీకు ఉన్న ధనాన్ని, పదవిని ఎలా కాపాడుకొంటున్నారో అంతకంటే ఎక్కువగా మానవుడు శాంతిని, ధైర్యాన్ని కాపాడుకోవాలి. ఈ రెండింటిని కాపాడుకోకపోతే మీ భక్తి నిలబడదు. మనస్సు అణుగుతూ ఉంటే మీకు మౌనంగా ఉండాలని అనిపిస్తుంది. మనస్సుకు ఏకాగ్రత, పవిత్రత, ధ్యానబలం వచ్చే కొలది మౌనస్థితి వస్తుంది. ఆ మౌనంలో నుండి శక్తి, కాంతి, శాంతి, జ్ఞానం ఉదయిస్తాయి. మౌనం అంటే నోరు మూసుకొని కూర్చోవటం కాదు, మనస్సు అణగటం

మౌనం. నీవు దేహం కాదు, నీవు కర్తవు కాదు. దేహం నేను అని అనుకోవటం వలన నేను కర్తను అనుకొంటున్నావు. దేహం నీవు కాదని తెలిసినప్పుడు నీకు కర్తృత్వబుద్ధి నశిస్తుంది. బాహ్యంగా మీకు ఏదైనా చెడ్డ జరిగినా కంగారు పడకండి, ఒక మంచికోసం అది అలా జరిగింది. అది ఎందుకు జరిగిందో మీకు తెలియక పోవచ్చు. మీ కళ్ళకు కనబడకపోవచ్చు, ఆ సంఘటన భవిష్యత్‌లో మీకు మంచిని తీసుకొని రావచ్చు. అది గ్రహించే శక్తి మీకు లేక ఆందోళన వస్తోంది.

మంగలి కత్తితో నీ నెత్తిమీద ఉన్న జుట్టు అంతా ఎలా గొరిగేస్తాడో అలాగే జ్ఞానం అనే కత్తితో నీ లోపల ఉన్న అజ్ఞానాన్ని గొరిగెయ్యి. అప్పుడు లోపల ఉన్న బ్రహ్మం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది అని ముండకోపనిషత్‌లో చెప్పాడు. అంతా ఈశ్వరుడే. నీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి నీకు కొంత కేటాయిస్తాడు, ఏదీ నీది కాదు కాని ఈ పొలం నాది, ఈ ఇల్లు నాది అని నీవు అనుకొంటూ ఉంటావు. నీవు ఏమి చేయాలి అంటే నీవు ఏదైనా తింటూ ఉంటే అది ఈశ్వరుడిదే అనుకొని తిను, నీవు ఎవరికైనా ఏదైనా ఇస్తున్నావు అనుకో, అది ఈశ్వరుడిదే, ఆయనది ఆయనకే ఇస్తున్నాను అనుకొని ఇయ్యి. ఇంక నీ ప్రమేయం ఏముంది? ఏమీ లేదు. కాని ఏదో ఉంది అని నీవు అనుకొంటున్నావు కాబట్టి అక్కడ నుండి నీకు అహంకారం, మమకారం ప్రారంభమవుతున్నాయి. ఇది అంతా భగవంతుడిదే అని సూక్ష్మబుద్ధితో అర్థం చేసుకొని, ఇది అంతా ఆయనదే అని అనుభవించు, నాది అనుకొని అనుభవించవద్దు. నేను బ్రహ్మంచేతిలో ఒక పనిముట్టును మాత్రమే అని గుర్తుంచుకో. నీవు నిమిత్తమాత్రంగా ఉన్నావు, పని నాది, గౌరవం నీది అర్జునా అని పరమాత్మ చెప్పాడు. అంతర్యామి యొక్క శక్తి, జ్ఞానం, వ్యాపకత్వం, యజమానత్వం ఇవిఅన్నీ నీకు అవగాహన కాకపోవటం వలన నేను ఏదో చేస్తున్నాను అని అనుకొంటున్నావు. ఈశ్వరుడిని శరణు వేడుకో, అంతటా ఉన్న వాడు ఆయనే. ఈశ్వరుని పాదాలను ఆశ్రయించకుండా ఆయన స్వరూపాన్ని మనకు ఇవ్వడు. మనలను ఆడించేవాడు ఈశ్వరుడే, చేసేది అంతా ఆయనే. మనకు కర్తృత్వం లేదు అనుకోండి ఎప్పడో శరీరం మరణించాక స్వర్గానికి వెళ్ళటం కాదు, ఇప్పడే ఇక్కడే మీ దుఃఖం అంతా ఆరిపోతుంది. లోపల ఉన్న సుఖసముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచు తున్నప్పడు స్వర్గం ఇస్తాను అన్నా వద్దు అనిపిస్తుంది, అట్టిది హృదయంలో ఉన్న శాంతి, ఆనందం. ఓ భగవంతుడా! నేను కటికచీకటిలో ఉన్నాను. నీ దయను చూపించి చీకటిలో

నుండి వెలుతురు లోనికి తీసుకొని వెళ్ళు, మృత్యువులో నుండి అమృతత్వంలోనికి తీసుకొని వెళ్ళు, అజ్ఞానంలో నుండి జ్ఞానం లోనికి తీసుకొనివెళ్ళు అని ప్రార్థిస్తున్నాడు. ఈశ్వరుని యొక్క శక్తి మనకు తెలియకపోవటం వలన మనకు భయం వస్తోంది, దుఃఖం వస్తోంది.

దేవుడికి శరీరం ఉందా? అని అడుగుతున్నారు. ముందు నీకు శరీరం ఉందో, లేదో చూసుకో? అన్నారు భగవాన్. నాకు శరీరం ఉంది అన్నాడు. నిద్రలో నీకు శరీరం కనబడుతోందా? అని అడిగారు. నిద్రలో ఈ శరీరం ఉందని, ఈ లోకం ఉందని నాకు తెలియటం లేదు అన్నాడు. నీకే దేహం లేనప్పుడు దేవుడికి దేహం ఏమిటి? అన్నారు. అందరూ ఏమనుకొంటున్నారు అంటే మేము ఏదో చేసేస్తున్నాము, ఎవరినో ఉద్ధరిస్తున్నాము, బరువు మోస్తున్నాము అనుకొంటున్నారు, అదే మీ దుఃఖానికి కారణం. నేను భగవంతుడిని ప్రేమిస్తున్నాను, ప్రేమించటం మంచిదే కదా! అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవంతుడిని ప్రేమించటం మంచిది కాదు అని ఎవరైనా అన్నారా? నేను భగవంతుడిని ప్రేమిస్తున్నాను అనటంలో ద్వయీభావం ఉంది, దేవుడు వేరు, నేను వేరు అనే భావన వస్తోంది. దేహం లోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో దేవుడు ఉన్నాడు అని, ఇది అంతా నీ మనస్సు కల్పిస్తోంది. ఉన్నది ఒక్కటే వస్తువు, అదే బ్రహ్మం, అదే పరమాత్మ. కల్పనకు ఏదైతే కారణమో అది అణిగినప్పుడు ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. మీ అమ్మాయిని మీరు ప్రేమిస్తున్నారు అనుకోండి. అది ఎప్పుడైనా తిట్టింది అనుకోండి, ఆ ప్రేమ అంతా పోతుంది. కాని మిమ్మల్ని మీరు ఎప్పుడూ ప్రేమించుకొంటున్నారు, దానికి కారణం ఏమిటి? దానికి కారణం మీరు ఒక్కరే నిజం, మీ లోపల ఉన్నదే నిజం. జీవుడి వేషంలో నేను ఉన్నాను, దేవుడి వేషంలో నీవు ఉన్నావు. నీ వేషం నీవు తీసేస్తే, నా వేషం నేను తీసేస్తే అప్పుడు ఉన్నదేదో ఉంటుంది, అదే బ్రహ్మం. అక్కడ మనం ఐక్యమయినప్పుడు ఆనందం శాశ్వతంగా నిలబడుతుంది. మనకు అనుకూలంగా ఉన్న వారిని మంచివారుగా, ప్రతికూలంగా ఉన్నవారిని చెడ్డవారుగా అనుకొంటున్నాము, దానికి కారణం స్వార్థం, వ్యక్తి భావన. మనం ఏదైనా ఒక పని చేస్తూ ఉంటే ఆపని ఎందుకు చేస్తున్నామో నిజంగా గ్రహించగలిగేవాడు ఈశ్వరుడు ఒక్కడే. ఎందుచేతనంటే ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. నీ కంటికి కనిపించేవాడిని, నీ ఇంటికి వచ్చేవాడిని, నీ శత్రువును, మిత్రుడిని ఈశ్వరభావనతో చూడు. ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే. బేధం ఉన్నప్పుడే భయం, కోపం,

అసూయ అన్నీ కూడా. బేధబుద్ధి పోయినప్పుడు అసూయ లేదు, కోపం లేదు, భయం లేదు, పునర్జన్మ లేదు. మీకు ఉన్న ధనాన్ని బట్టిగాని, అధికారాన్ని బట్టిగాని, చదువును బట్టిగాని మాలో ఏదో ప్రత్యేకత ఉంది అని మీరు ఎవరైనా అనుకొంటే అది మీ అజ్ఞానానికి గుర్తు. మీ మనస్సు శాంతిగా ఉంటే ప్రపంచం అంతా శాంతిగా ఉన్నట్లు అనిపిస్తుంది. మీ మనస్సు ఆందోళనగా ఉంటే ప్రపంచం అంతా ఆందోళనగా ఉన్నట్లు అనిపిస్తుంది. మనస్సుకు వేరుగా ప్రపంచం లేదు, మాయ లేదు. అది అణిగిపోతే ఏమీ లేదు. అమనస్కస్థితి పొందినప్పుడు పునర్జన్మ ఆగిపోతుంది.

మనకు బయట శుచి ఎంత అవసరమో లోపల శుచి కూడా అంతే అవసరం. మనం చేస్తున్న పని మనకు శుద్ధి తీసుకొనిరావాలి. నీ మాట సరళంగా ఉండాలి, నీ ఆలోచన నిర్మలంగా ఉండాలి, కపటం పనికిరాదు. చెవుల ద్వారా వినేది, కళ్ళద్వారా చూసేది మనస్సు. ఇది లోపల ఉన్న పనిముట్టు. శరీరం కాలిపోయినప్పుడు ఇంద్రియాలు కాలిపోతాయి కాని మనస్సు కాలదు. పుష్పాల నుండి వాసనను గాలి ఎలా మోసుకొని పోతుందో అలాగ మనస్సు నీ లోపల ఉన్న వాసనలను, తలంపులను ఒక్కటి కూడా విడిచిపెట్టకుండా మోసుకొని పోతుంది. నీవు చేసిన పనులకు, నీకు వచ్చిన ఆలోచనలకు భవిష్యత్‌జన్మలలో నీచేత సమాధానం చెప్పిస్తాడు, నీవు ఎత్తుకు ఎత్తు అనుభవించాలి. ఇది కర్మసిద్ధాంతం. మంచి మాట, మంచి చేత, మంచి ఆలోచనలు ఎందుకు అంటే వాటివలన నీ అంతఃకరణం శుద్ధి అవుతుంది. అరుణాచలాన్ని స్మరించగా, స్మరించగా మనస్సు శుద్ధి అవుతుంది, అది పల్చబడి చిరిగిపోతుంది, అప్పుడు ఉన్నది మోక్షమే. మనం గొప్పలకోసం, గౌరవాల కోసం మంచిపనులు చేస్తున్నాము అనుకోండి, అవి నాసిరకమైన ప్రేమలు. వాటిని చూసి ప్రపంచం మోసపోవచ్చుగాని భగవంతుడు మోసపోడు. నాసిరకమైన ప్రేమలవలన, పనుల వలన నీకు మోక్షం వస్తుందా? నేను వేరు, భగవంతుడు వేరు అనే భావన నీకు ఉంది. నీవు భగవంతుడిని ప్రేమిస్తాను అంటున్నావు. భగవంతుడిని ప్రేమించి, ప్రేమించి దాని శిఖరాన్ని అందుకొంటే ఆ ప్రేమ ప్రవాహంలో నీవు పోతావు, దేవుడు మిగులుతాడు అంటే రెండోది పోతుంది. రెండవది లేనిది సత్యం, రెండవది లేనిది జ్ఞానం, రెండవది లేనిది అమృతత్వం.

మీరు మంచి చేయండి అని భగవంతుడు చెపుతున్నాడు. మీరు చేసే మంచి పనుల వలన లోకం ఉద్ధరింపబడుతుంది అని కాదు, మంచి చేయటం వలన, మన బుద్ధిలో ఉన్న

దోషాలు పోతాయి. నీ బుద్ధిలో ఉన్న దోషాలు పోయినప్పుడు లోపల ఉన్న పరమాత్మ నీకు వ్యక్తమవుతాడు. మనకు చాలా డబ్బు ఉంది, పాండిత్యం ఉంది, పెద్ద పదవి ఉంది, అన్నీ ఉన్నాయి, అయినా మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, వాటిని ఏమి చేసుకొంటారు, మీకు దుఃఖం వస్తూ ఉంటే అది జ్ఞానం ఎలా అవుతుంది. కర్తృత్వబుద్ధి నశించే వరకు మిమ్మల్ని దుఃఖం వెంటాడుతుంది. నీకు శాశ్వతంగా దుఃఖం రాకూడదు, అది పరమస్థితి. సాధన చేయగా చేయగా ఏదో రోజు కలిసి వస్తుంది. ఎదురు చూసినట్లు ఉండకూడదు. మీరు మంచి చేసారు అనుకోండి, ఆ ఫలితం మీకే ఇచ్చేస్తాడు ఎందుచేత నంటే ఆయనకు ఏమీ అక్కరలేదు, కర్మఫలం కోరవద్దు అని భగవంతుడు చెప్పాడు కాని ఫలితం ఇవ్వనని ఆయన చెప్పలేదు. మన మాటలే, మన ఆలోచనలే మనలను బంధిస్తాయి. అనుకొనేవాడు జీవుడు, ఏమీ అనుకోనివాడు దేవుడు. అనుకొనేవాడు బంధింపబడతాడు. ఎట్టిపరిస్థితులలోను మీ శాంతిని పాడుచేసుకోవద్దు, శాంతచిత్తమును కాపాడుకోండి. పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా మీరు శాంతిగా ఉంటున్నారు అనుకోండి, అప్పడు భగవంతుడు మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. ఎవరైనా పొగిడితే నీకు పొంగువస్తుంది అనుకో, ఎవరైనా విమర్శిస్తే నీవు కృంగిపోతావు అనుకో నీవు ఇంకా భక్తిమార్గానికి ఫిట్ అవ్వలేదు అంటున్నాడు పరమాత్మ. పొంగటం, కృంగటం ఇవి లోకమానవుడు చేసేపని నీవు భక్తుడవు అయిఉండి నీకు ఈగోల ఎందుకు? నిందను, స్తుతిని తట్టుకోలేకపోతే ప్రాపంచిక మానవుడికి నీకు తేడా ఏమిటి? అంటున్నాడు. మంచిపనులు చేసిన ఈ లోకంలోనికి వచ్చి వెళ్ళిపోయిన గుర్తు ఎవడైతే కోరడో వాడు నిజమైన మంచివాడు. ఈ ఘనత్వం, ఈ నీచత్వం మనోదేహములకు సంబంధించినవి. మనోదేహములను దాటితే ఘనత్వం లేదు, నీచత్వం లేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-10-05, కైకలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ ప్రవచనాలు అన్నీ జ్ఞానయజ్ఞాలు, సబ్జక్టు మీ అంతట మీరు చదువుకోవటం కంటే, ముందు శ్రవణం చేసి తరువాత చదువుకొంటే బాగా అర్థమవుతుంది, దాని తాలుక సుఖం మీకు తెలుస్తుంది. మీలో ఎవరికైనా కష్టాలు ఉన్నా, ఇబ్బందులు ఉన్నా, ఒకవేళ మీ దేహప్రారబ్ధం మీకు అనుకూలంగా లేకపోయినా వీటినన్నింటిని కూడా మనం భక్తి వలన అతిక్రమించవచ్చు. మనకు ఉన్న భక్తి నిజమైతే కుటుంబపరంగా కాని, సమాజపరంగా కాని ఎన్ని కష్టాలు వచ్చినా

ఆ కష్టాలను అతిక్రమించగలిగే శక్తి మనకు వస్తుంది. ఎక్కడయితే భక్తి ఉంటుందో అక్కడ సహనం ఉంటుంది, అక్కడ ప్రకాశం ఉంటుంది, అక్కడ జ్ఞానం ఉంటుంది, అక్కడే మోక్షం ఉంటుంది. జ్ఞానం, వైరాగ్యం భక్తి యొక్క పిల్లలు. మనకు క్రమ శిక్షణ ఉంటేకాని, ఈశ్వరుడిపట్ల సజీవమైన విశ్వాసం ఉంటేకాని ఆ భక్తి మనకు ఉదయించదు. పూర్వజన్మసుకృతం, సజ్జనసాంగత్యం మనకు ఇవిఅన్నీ కలిసిరావాలి, ముముక్షత్వం ఉండాలి, జిజ్ఞాస ఉండాలి, ఇన్ని కలిసివస్తేగాని ఆ భక్తి నిలబడదు. ఇది అంతా భగవంతుడి యొక్క లీల, ఇది నిజం కాదు కాని ఇది మనకు నిజంలాగ కనిపిస్తోంది. మనకు భక్తి, జ్ఞానం, వైరాగ్యం, వివేకం లేకపోవటం వలన నిజం కానిది నిజంలాగ మనకు కనిపిస్తోంది. ఒకసారి రామకృష్ణ పరమహంస మాటలు చెపుతూ ఉంటే ఒకరు ఆ మాటలు విని మీరు చెప్పే మాటలు చాలా నిస్సారంగా ఉన్నాయి అన్నాడు. దానికి పరమహంస ఉద్రేక పడలేదు. మీకు లోకానికి సంబంధించిన జ్వరం ఎక్కువగా ఉంది అందుచేత ఈ మాటలు రుచించటం లేదు అన్నారు. రజోగుణం, తమోగుణం ఉన్నవారికి పరమహంస మాటలు ఎలా నచ్చుతాయి.

ఈశ్వరుని లీలలు మనకు అర్థం కావు. ఎవరికైనా కష్టాలు వచ్చినా తొందరపడవద్దు. ఆ కష్టం భవిష్యత్‌లో సుఖాన్ని తీసుకొని రావచ్చు లేకపోతే ఆ కష్టం మన మనస్సును మోక్షం వైపుకు తిప్పటానికి రావచ్చు అందుచేత మనం తొందరపడకూడదు. కర్త భగవంతుడే. భగవంతుడు కర్త మాత్రమే కాదు, కర్మ కూడా ఆయనే. మన చేతిలో ఏమీ లేదు. మనకు దేహాభిమానం ఉండటం వలన, మన మనస్సుకు లోపలకు వెళ్ళే శక్తి లేకపోవటం వలన ఇది అంతా నేనే సాధిస్తున్నాను అని అనుకొంటాము. మనకు రాబోయే జన్మ గురించి తెలియదు, గత జన్మ తెలియదు. మనం ఈ లోకంలోనికి వచ్చాము, కాలాన్ని సద్వినియోగం చేసుకోవటం కూడా మనకు తెలియటం లేదు. మనకు మరణం వచ్చింది అనుకోండి కొద్ది టైము ఆగు, నేను సాధన చేసుకొంటాను అంటే ఆగదు. కాలాన్ని కనుక మనం సద్వినియోగం చేసుకోకపోతే అది మనలను మింగేస్తుంది. ఎవడైతే కాలాన్ని సద్వినియోగం చేసుకొంటాడో వాడికి జ్ఞానం కలుగుతుంది. ఒక్క కాలమే కాదు మనకు చదువు ఉంటే చదువును, డబ్బు ఉంటే డబ్బును, తెలివి ఉంటే తెలివిని కూడా సద్వినియోగం చేసుకోవాలి. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటనే మన మనస్సుకు అంతర్‌దృష్టి కలుగుతుంది కాని లేకపోతే అంతర్‌దృష్టి రాదు.

మరణం అంటే అందరికీ భయం ఉంటుంది. మరణం అంటే ఏమీ లేదు పాత శరీరం పోతుంది, కొత్త శరీరం వస్తుంది అంతే. ఈ శరీరానికి మరణం రాకముందే ఎవడైతే బ్రహ్మానుభవాన్ని పొందాడో వాడు మాత్రమే కాలాన్ని సద్వినియోగం చేసుకొన్నట్లుగా మనం గుర్తు పెట్టుకోవాలి. యుద్ధం తరువాత కృష్ణుడు పాండవులను భీష్ముడి దగ్గరకు తీసుకొని వెళతాడు. వీరందరిని చూసేటప్పటికి భీష్ముడికి కన్నీళ్ళు వస్తాయి. ఇంతటి మహాత్ముడికి కన్నీరు రావటం ఏమిటి? చావు అంటే భయం వేస్తోందా తాతగారికి? అని ధర్మరాజు కృష్ణుడిని అడుగుతాడు. తాతగారికి కన్నీరు వస్తోంది అని నన్ను అడిగితే నేను ఏమి చెపుతాను, తాతగారినే అడుగు అంటాడు కృష్ణుడు. భీష్ముడికి కన్నీళ్ళు ఎందుకు వస్తున్నాయో తెలియని వాడుకాదు పరమాత్మ, భీష్ముడు చెపితే విందామని. అప్పుడు ధర్మరాజు భీష్ముడిని కన్నీళ్ళు ఎందుకు వస్తున్నాయని అడుగుతాడు. ధర్మజా! మీరు జీవితంలో చాలా కష్టాలు పడ్డారు, బాధలు అనుభవించారు. మామూలుగా కష్టాలు పడటం వేరు, సాక్షాత్తు పరమాత్మ కూడా ఉండి కూడా కష్టాలు పడుతున్నారు, ఇది కదా భగవంతుడి యొక్క లీల, భగవంతుడి యొక్క మాయ ఇట్టిది కదా అని జ్ఞాపకం వచ్చి కన్నీళ్ళు వస్తున్నాయి అంతేగాని చావు గురించి భయం వలన కాదు అని భీష్ముడు చెప్పాడు. భగవంతుడి యొక్క శక్తి, భగవంతుడి యొక్క లీలలు మనం అర్థం చేసుకోవాలి అని చెప్పటంకోసం భీష్ముడు చేత చెప్పించాడు. ఈ లోకాన్ని ఎలా ఆడించాలో అంతా పరమేశ్వరుడు చూసుకొంటాడు. మనం ఈ లోకంలోనికి వచ్చాము, ఆయన పాదాల మీద భక్తిని నిలబెట్టుకొంటూ జ్ఞానం సంపాదించుకొని బయటకు వెళ్ళిపోవాలి. ఇది అంతా ఆయన లీల, ఇది మనకు అర్థంకాదు. అందుచేత మన పని ఏదో మనం చూసుకొని ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోవటం మంచిది అని భీష్ముడు చేత పరమాత్మ చెప్పించాడు.

మీరు అందరూ సంసారంలో ఉన్నారు జ్ఞానం వస్తుందా? రాదా? అని కంగారు పడకండి. ఒక చేతితో మీ ఇంటి దగ్గర పని చూసుకోండి, ఒక చేతితో భగవంతుని పాదాలను పట్టుకోండి. మీరు చేసే పని పూర్తి అయిపోయింది అనుకోండి, విశ్రాంతి జీవితం వచ్చింది అనుకోండి అప్పుడు రెండు చేతులతో భగవంతుడి పాదాలను పట్టుకోండి అని రామకృష్ణుడు చెప్పారు. మన పొట్టకు అన్నం కావాలి. అన్నం కావాలి అంటే డబ్బు ఉండాలి, కట్టుకోవటానికి బట్టలు ఉండాలి దానికి డబ్బు కావాలి, ఉండటానికి ఇల్లు కావాలి దానికి డబ్బు కావాలి,

ఏదైనా రోగం వస్తే మందులు వేసుకోవాలి దానికి డబ్బు కావాలి. ఇది తప్పించి నీకు డబ్బుతో పని ఏమిటి? అన్నాడు రామకృష్ణుడు. వీటికి తప్పించి నీ దగ్గర పదివేల కోట్లు ఉన్నా నీకు ప్రయోజనం ఏముంది? అది ఎవరో ఒకరు తింటారు. నీకు సంబంధించినంత వరకు నీవు తరిస్తున్నావో లేదో చేసుకో. తామరాకును నీరు అంటదు అలాగే భక్తుడిని కర్మ అంటదు. భక్తుడు భగవంతుడి చేతిలో కేవలం పనిముట్టుగానే ఉంటాడు. బ్రహ్మం మన హృదయంలోనే ఉంది. అది రూపరహితం, నామరహితం, క్రియారహితం. దానితో నీకు అనుబంధం ఏర్పడితే మంచిదే లేకపోతే బాహ్యంగా ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. సజ్జన సాంగత్యం దొరకటం కూడా చాలా కష్టం. మనంతట మనం సాధన చేసి చెడుతలంపులలో నుండి బయటకు రాలేకపోతున్నాము అనుకోండి, సజ్జనసాంగత్యం వలన వాటిలో నుండి బయట పడవచ్చు, వారు మనకు సహాయ సహకారములు అందిస్తారు.

ఏది ఎప్పుడు జరగాలో అది జరిగిపోతూ ఉంటుంది. మీకు ఒకవేళ రోజులు వైభవంగా వెళ్ళిపోతున్నా అదీ స్వప్నమే, ఇబ్బందులతో రోజులు గడుస్తున్నా అదీ స్వప్నమే అయితే ఇది మంచికల అనుకోవచ్చు, దానిని చెడ్డకల అనుకోవచ్చు. ఈ ప్రపంచం అంతా స్వప్నం అంటున్నారు ఏమిటి అని మీరు అడగవచ్చు, మీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీకు వ్యక్తమైనప్పుడు కాని ఇది స్వప్నం అన్న సంగతి మీకు అనుభవంలోనికి రాదు. మంచివారు ఏ పని చేసినా మౌనంగానే చేస్తారు, వారికి ఆడంబరం అక్కరలేదు, గుర్తింపులు అక్కరలేదు. ఎందుచేత నంటే అజ్ఞానికి ఇతరులు ఉన్నారు కాని జ్ఞానికి ఇతరులు లేరు. నీకు ఎన్ని కంఫర్ట్సు ఉన్నా నిద్ర పట్టకపోతే ప్రయోజనం లేదు అలాగే నీకు ఎన్ని ఉన్నా శాంతి లేకపోతే ప్రయోజనం లేదు. శాంతి యొక్క వైభవం ఎటువంటిది అంటే నేను శాంతిగా ఉన్నాను అనుకోండి మీరందరు నాకు స్నేహితులు అయినా కాకపోయినా స్నేహితులుగా కనబడతారు, నేను అశాంతిగా ఉన్నాను అనుకోండి మీరందరు నాకు విరోధులుగా కనబడతారు. మనం సాధన చేసి అశాంతిలో నుండి ఎంతవరకు విడుదల పొందుతున్నాము అనేది చూసుకొంటూ ఉండాలి. మీరు ఇలా రండి బోధిస్తాను అని పది మందిని పోగుచేసుకొని గురువై పోదామని చూస్తారు. కొబ్బరిచెట్టు ఎక్కకుండానే కొబ్బరికాయలు తీసేసుకొంటాను అనటం ఎటువంటిదో, ఏమీ సాధనలు లేకుండానే నేను బోధిస్తాను అనటం అటువంటిదే. నువ్వు సాధన చేసి అధికారం సంపాదించి నాలుగు మాటలు చెపితే ఎవరైనా వింటారు, అధికారం

లేకుండా చెపితే ఎవరూ పట్టించుకోరు.

మనం పుణ్యం చేసినా, పాపం చేసినా శరీరం, వాక్కు, మనస్సు ఈ మూడే పరికరాలు. అందుచేత ఈ మూడింటిని బాగా సద్వినియోగం చేసుకోవాలి. నియమింపబడినటువంటి వాక్కు ఉండాలి, స్వాధీనం అయిన శరీరం ఉండాలి, నిగ్రహింపబడినటువంటి మనస్సు ఉండాలి, ఇవన్నీ ఆత్మజ్ఞానసముపార్జనకు సహకరిస్తాయి. లౌకికులతో స్నేహం చేయటం తేలిక, విడిపించుకోవటం కష్టం. అందుచేత లౌకికులతో స్నేహం చేయకండి, జాగ్రత్తగా ఉండండి అని రామకృష్ణుడు చెప్పారు. మన మాటలు సక్రమంగా లేకపోతే, ఎప్పుడు ఎలా మాట్లాడాలో అలా మాట్లాడకపోతే మన మాటలే మనల్ని బలికోరతాయి. ఇతరులు ఎటువంటి వారు అని మనకు అనవసరం, వారితో అనుబంధం మాత్రం శాంతిగా ఉండాలికాని అశాంతిగా ఉండకూడదు. మనం ఇతరుల విషయాలలో కలుగజేసుకోకుండా, మన చేతిలో ఉన్న పనిని సక్రమంగా చేసుకొంటూ, బేధదృష్టి తగ్గించుకొంటూ, జపతపములతో కాలక్షేపం చేస్తూ, సజ్జనసాంగత్యం చేస్తూ, ఈశ్వరుని పట్ల సజీవమైన విశ్వాసం కలిగిఉంటే ఎప్పుడో కాదు ఇప్పుడే ఇక్కడే ఈ శరీరానికి మరణం రాకముందే మనం మోక్షసుఖాన్ని పొందవచ్చు. అయితే అంతర్యామి దయ లేకుండా ఆ మోక్షసుఖం మనకు రాదు. ఒక్క ఆత్మలో తప్పించి సుఖం ఎక్కడా లేదు. ఆత్మసుఖం మీకు అనుభవంలోనికి వచ్చిందా మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. లోకంలో ఏదో ఉంది అని అనుకోవటం వలన మన మనస్సు బాహ్యముఖానికి ప్రయాణం చేస్తోంది. లోకంలో ఏమీ లేదు, నీ కోరిక అలా అనిపింప చేస్తోంది, అంతా మనస్సే. నేను జిన్నూరులో ఉన్నట్లు కైకలూరులో ఉండలేకపోతున్నాను అనుకోండి నా మనస్సులో ఏదో దోషం ఉన్నట్లు గుర్తు. మనస్సును విడిచిపెట్టి మాయలేదు, మనస్సును విడిచిపెట్టి అజ్ఞానంలేదు. మాయ అంతా మనస్సులోనే ఉంది. ఆ మనస్సు అణిగిపోతే మాయ కూడా అణిగిపోతుంది.

పుల్లటికాయలు కాచే చెట్లు, తియ్యటి కాయలు కాచే చెట్లు, చేదుకాయలు కాచే చెట్లు ఉంటాయి. అలాగే మనుషులలో కూడా కొంతమంది తియ్యగా ఉంటారు, కొంతమంది పుల్లగా ఉంటారు, కొంతమంది చేదుగా ఉంటారు. ఈ అందరి మధ్యలో ఎవరిమీద బేధ దృష్టి పెట్టుకోకుండా, ఎవరి మీద ఉద్రేకం పడకుండా ఇది అంతా ప్రకృతి సహజం అనుకొంటూ సమన్వయం చేసుకొంటూ, మన పని ఏదో మనం శ్రద్ధగా చేసుకొంటూ జ్ఞానం సంపాదించు

కొని ఈ లోకంలోనుండి బయటకు పోవాలి, అప్పుడు నీకు సొమ్ము, అలా చేయకపోతే నీ నోటినిండా దుమ్ము. రాముడు దేవుడు అనుకొంటున్నాము. ఆయన రామేశ్వరంలో నుండి లంకలోనికి వెళ్ళటానికి సారధి కట్టవలసి వచ్చింది. ఆంజనేయస్వామి రామ, రామ, రామ అనుకొంటూ సముద్రాన్ని లంఘించి ఆప్రక్కకు వెళ్ళిపోయాడు. అంటే రాముడు కంటే రామ నామం గొప్పదని మీకు తెలియటం లేదా అన్నాడు రామకృష్ణుడు. నామం యొక్క ప్రభావం ఎలా ఉంటుందో మీకు తెలియటం లేదు ఎందుచేతనంటే మీకు విశ్వాసం లేదు. మనం లోపల ఏదో కోరిక పెట్టుకొని భగవంతుడిని ప్రార్థిస్తాము. ఒకవేళ ఆ కోరిక నెరవేరవచ్చు కాని దాని వలన ప్రయోజనం లేదు. మనం ఎవరికోసమైతే ప్రార్థించి వారి కోరిక నెరవేరేలా చూసామో చివరకు వారే మనకు శత్రువులు అవుతారు, జరిగేది అది. అందుచేత ప్రకృతి గొడవలు విడిచిపెట్టు. నీకు ఏదైనా కోరిక వస్తే ఆ కోరిక నెరవేర్చమని భగవంతుడిని ప్రార్థించటం మొదలుపెట్టవద్దు. నీకు ఏది మంచిదో ఈశ్వరుడి కంటే నీకు ఎక్కువ తెలుసునా? నీకు తెలియదు, మరి ఇంక ఆ కోరికలు ఎందుకు? నువ్వు ఏమైనా సర్వజ్ఞుడివా? ఈ గోడ ప్రక్కన ఏముందో నీకు తెలియదు. స్వామివారు గోవర్థనపర్వతాన్ని బొటనవేలితో ఎత్తిపట్టుకొని వారంరోజులు ఉంచారు. మనం చీపిరికట్టను పైకి లేవదీయలేము. నేను ఘనకార్యం చేస్తున్నాను అని ఆయన అనుకోలేదు, అలా అనుకొంటే ఆయన దేవుడు కాదు. ఆ పని చెయ్యాలని చేయలేదు ఇంద్రుడి యొక్క గర్వం అణచటానికి చేసాడు. మన ఋషులను, అవతారపురుషులను గురించి మీరు శ్రవణం చేయాలేగాని వారు అమృతాన్ని వర్షం కింద కురిపిస్తారు.

రాబందులు ఆకాశంలో చాలా పైన ఎగురుతాయి కాని వాటి దృష్టి అంతా క్రింద శవాల మీద ఉంటుంది, ఎక్కడ శవాలు కనిపిస్తే అక్కడ వాలి తిందామని చూస్తాయి. అలాగే కొంతమంది పండితులు వారికి పాండిత్యం ఉంటుంది కాని వారి దృష్టి లౌకికవిషయాల మీదే ఉంటుంది, లౌకికవిషయాలను అతిక్రమించలేరు అని రామకృష్ణుడు చెప్పారు. కొంత మంది సహజంగానే జ్ఞానులుగా పుడతారు, శుకమహర్షి, శంకరాచార్యుల వంటివారు. కొంత మంది రమణమహర్షి లాంటివారు సడన్‌గా జ్ఞానులైపోతారు, అరుణాచలం అరుణాచలం అన్నారు అంతే ఆయన పని పూర్తి అయిపోయింది. కొంతమంది సాధన చేసి సాధన చేసి ఇంద్రియాలను, మనస్సును అరగదీసి జ్ఞానం సంపాదిస్తారు, అందరూ జ్ఞానులే. మీ పూర్వ

జన్మ సంస్కారాన్ని బట్టి అటువంటి సత్పురుషుల, జ్ఞానుల సహవాసం దొరికితే మీ ప్రయత్నం తక్కువైనా మీలో ఉన్న వాసనలు, పునర్జన్మలను తీసుకొని వచ్చే సంస్కారాలు అన్నీ ఒకోటి, ఒకోటి సన్నగిల్లిరాలిపోతాయి, సజ్జన సాంగత్యం యొక్క గొప్పతనం అట్టిది. మీరు స్నేహితుల దగ్గరకు, బంధువులు దగ్గరకు వెళ్లినప్పుడు జ్ఞానాన్ని శాంతిని తీసుకొని వెళ్లాలి, కాని మీరు అశాంతిని, అజ్ఞానాన్ని తీసుకొని వెళతారు. అసలే వారు అజ్ఞానంతో, అశాంతితో కాలిపోతూ ఉంటే ఇంకా దానిని పెంచుతున్నారు. అందుచేత మీరు శాంతికి రాయబారులుగా ఉండాలి, జ్ఞానానికి రాయబారులుగా ఉండాలి. అందుచేత మనం చేస్తున్న పని ఏమిటి? మనం ఎలా మాట్లాడుతున్నాము? ఇతరులకు మన ద్వారా జరిగేది ఏమిటి అని చూసుకోవాలి. రావణాసురుడిని తక్కువవాడు అనుకోకండి, చాలా గొప్పవాడు, అనేక వరాలు పొందాడు, మహా ఐశ్వర్యవంతుడు. ఇన్ని వరాలు ఉండి, ఇంత ఐశ్వర్యం ఉండి ఎలా పాడై పోయాడు? ఇతరులు ఆయనను పాడుచేయలేదు, ఆయన చేసిన చెడ్డకర్మల వలననే ఆయన పాడైపోయాడు. ఎవరి జీవితం అయినా అంతే, ఆయన ఆరంభించిన హింసా విధానం వలన ఆయన పొందిన వరాలు కూడా ఆయనకు ఉపయోగం లేకుండా పోయింది, బూడిదలో పోసిన పన్నీరు అయిపోయింది.

ప్రపంచ విషయాల మీద మనకు ఏమైనా కోరికలు ఉన్నాయి అనుకోండి దానిని కామం అంటారు. భగవంతుడు కావాలి అని కోరుకొంటున్నాము అనుకోండి దానిని భక్తి అంటారు. ఇంతే ఇందులో ఏదో పెద్ద తేడా ఉందని బుర్రని గాబరా చేసేసుకోవద్దు. మన మొఖం ఇటు తిప్పే బదులు అటు తిప్పితే చాలు. మీరు కోరికను విడిచిపెట్టనక్కరలేదు. మీ కోరికను భక్తివైపుకు మరల్చండి, మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీ అమ్మాయి మీరు చెప్పినట్లుగా ప్రతీదీ వింటోంది అనుకోండి, మీకు ఉన్న ఆస్తి అంతా మీ అమ్మాయికి ఇచ్చేయాలనిపిస్తుంది, నీకు నా ఆస్తి ఏమీ ఇవ్వను అని మీరు అమ్మాయితో చెప్పినా మీ ఇష్టం అని అంటుంది. అలా ఎవడైతే భగవంతుడు చెప్పినట్లుగా ఉంటున్నాడో వాడికి ఆత్మ తన్నుతాను అర్పించుకొంటుంది, అది ఆత్మ యొక్క వైభవం. చైతన్యాన్ని తెలుసుకోవటానికి మనం ఎంతటివారము, మన తెలివి ఎంత? చైతన్యం మనకు తెలియబడితే తెలుసుకోవ టానికి పనికివస్తాము కాని నాకు తెలియబడు అని అడగటానికి మనకు అర్హత లేదు. మీరు గురువుకు సేవ చేస్తే అది వృధా పోతుంది అని అనుకోవద్దు దాని వలన మీలో ఉన్న వాసనలు

నశిస్తాయి. మీకు జ్ఞానం కలుగుతుంది, అది గురువు యొక్క అనుగ్రహం. మనం భగవంతుడు చెప్పిన మాటను వింటే అది ధర్మం, నువ్వు చెప్పిన మాటను నేను వినను అని భగవంతుడిని తిరస్కరిస్తే అది అధర్మం. అరణ్యవాసంలో రామచంద్రమూర్తి లక్ష్మణుడితో నువ్వు ఆలోచించి ఎక్కడ బాగుంటే అక్కడ ఒక పర్ణశాల నిర్మించమని చెపుతాడు. మీరు పర్ణశాల ఎక్కడ నిర్మించమంటే అక్కడ నిర్మిస్తాను కాని నిర్ణయం నాకు ఇవ్వకండి అంటాడు లక్ష్మణుడు, అది శరణాగతి. కొంతమంది భక్తులు ఎలా ఉంటారు అంటే భగవంతుడు దర్శన మిచ్చి మీకు ఒక గంటలో మోక్షం ఇస్తాను అంటే వారికి ఏమీ అనిపించదు, నిర్వికారంగా ఉంటారు, ఇప్పుడు మీకు మోక్షం ఇవ్వను, లక్ష జన్మల తరువాత మోక్షం ఇస్తాను అంటే మీ ఇష్టం అంటారు, వారికి జ్ఞానం వచ్చేది.

మనకు మనస్సు ఉంది కాబట్టి తొంభై రకాలుగా అనుకొంటూ ఉంటాము. అనుకొనేది జీవసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. అది అలా ఎందుకు జరిగింది, ఇది ఇలా ఎందుకు జరిగింది అని మనం అనుకొంటాము, అది ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు. చేసేది ఆయనే, అసలు ఉన్నది ఆయనే నువ్వు అంటూలేవు. నువ్వు ఉన్నాను అనుకొంటున్నావు అందుచేత దుఃఖం నిన్ను వెంటాడుతోంది. నీకు శరీరంతో ఎలా తాదాత్మ్యం ఉందో, మనస్సుతో ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ నీ లోపల ఉన్న సత్యవస్తువుతో తాదాత్మ్యం పొందు, దానితో ఏకంగా ఉండు, హృదయంలో మునుగు, అప్పుడు అది నీకు ఎరుకలోనికి వస్తుంది. ఎవరైనా ఒక మనిషిని వాడు ఎట్టివాడు అంటే వాడు మంచివాడు, వాడు చెడ్డవాడు అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? ఒకేసారి మంచివాడుగా, చెడ్డవాడుగా ఎలా ఉంటావు. ఉంటే మంచివాడుగా ఉండాలి, లేకపోతే చెడ్డవాడిగా ఉండాలి. ఉంటే నీకు సత్యబుద్ధి ఉండాలి లేకపోతే అసత్యబుద్ధి ఉండాలి. నీవు సత్యాన్ని గుర్తిస్తున్నావు అనుకో అసత్యం నిన్ను విడిచి పెట్టేస్తుంది. కుమ్మరి కుండలు చేస్తూ ఉంటాడు. ఒక కుండ ఎండిపోయింది, ఒక కుండ పచ్చిగా ఉంది. ఒక ఎద్దు వచ్చి ఆ రెండు కుండలను తొక్కేసింది అనుకోండి. అప్పుడు కుమ్మరి ఎండిపోయిన కుండను బయటపడేస్తాడు, పచ్చికుండను తీసుకొనివచ్చి మరల మట్టిలో కలిపేస్తాడు, ఎండిపోయిన కుండను మట్టిలో కలపటం కుదరదు కదా. అదేవిధంగా ఈ జీవితంలో తపస్సు చేసి, సాధన చేసి విషయవాసనలను ఎవడైతే ఎండబెట్టాడో వాడు సంసారానికి పనికిరాడు, వాడిని భగవంతుడు సంసారంలో నుండి విడదీస్తాడు, వీరు ముక్త

జీవులు అని వారిని వదిలేస్తాడు, వారికి ఉన్నదంతా స్వేచ్ఛ. ఇంకా ఎవరైతే పచ్చిగా ఉన్నారో వారిని తీసుకొని వచ్చి మరల సంసారంలో పడేస్తాడు అని రామకృష్ణుడు చెప్పారు. నీకు మనస్సు ఉన్నంతకాలం భయాలు వస్తూ ఉంటాయి, అసూయ, ఇష్టం, అయిష్టం, మోహం, దుఃఖం వస్తూ ఉంటుంది. ఎన్నో గొడవలు వస్తూ ఉంటాయి. ఎన్ని వచ్చినా మీరు గురువుతో కనుక కలిసి ఉంటే మీకు వచ్చిన భయాలు, ఆలోచనలు, దుఃఖం అన్నీ పోతాయి, అట్టివాడు గురువు, అది గురువు యొక్క వైభవం.

నీకు మోహం ఉంటే మంచివాడు చెడ్డవాడుగా, చెడ్డవాడు మంచివాడుగా, ఉన్న వస్తువు లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా కనిపిస్తుంది. మనం ఏమి మాట్లాడుతున్నాము, ఏ పని చేస్తున్నాము, ఎలా ప్రవర్తిస్తున్నాము దాని పరిణామం ఏమిటి అని మనం జాగ్రత్తగా చూసుకోవాలి. నువ్వు మందులు మింగుతూ ఉంటే దానివలన రోగం తగ్గుతోందో, లేదో చూసుకో. అలాగే నువ్వు సాధన చేస్తే సరిపోదు దానివలన మారుమనస్సు వస్తోందో లేదో చూసుకోవాలి. ఒక మహాత్ముడు సన్నిధిలో నీవు జీవిస్తూ ఉంటే నీ సాధనతో నిమిత్తం లేకుండా నువ్వు కూడా పరమపవిత్రుడవు అవుతావు, ఆయన సమక్షంలో ఉండటం వలననే నీకు తెలిసినా, తెలియకపోయినా నీకు కావలసిన శక్తి, జ్ఞానము, శాంతి నీకు అందుతూ ఉంటాయి. మీరు చేసే ప్రాణాయామాల కంటే, పూజలు జపాలకంటే గురువు పాదాల మీద భక్తి చాలు మనం ఉద్ధరింపబడటానికి, ఆ పాదాలే మనలను తీసుకొనిపోతాయి. మాకు ఆ తలంపులు వస్తున్నాయి, భయాలు వస్తున్నాయి ఆగోల నీకు ఏల? నీకు పునర్జన్మను తీసుకొని వచ్చే కోరికలు, నిన్ను బంధించే పెద్ద పెద్ద దుంగలలాంటి వాసనలు ఎన్నిఉన్నా అవిఅన్నీ కూడా గురువు సమక్షంలో ఉండటం వలన ఆయన దయ వలన రాలిపోతాయి. కొంతమంది భక్తులు రమణమహర్షికి దగ్గరగా ఉండేవారు. భగవాన్ నోటితో చెప్పనక్కరలేకుండానే ఆయనకు ఏమికావాలో ఆ భక్తులకు తెలిసేది. కొంతమంది ఆయన హృదయానికి అంత సన్నిహితంగా ఉండేవారు. వారు ఎవరైనా చనిపోయినట్లు వార్త వస్తే వారు వెళ్ళిపోయారు, నేను ఇంకా మిగిలాను అనేవారు. ఎచ్చమ్మాళ్ చనిపోయినప్పడు కూడా ఆమె వెళ్ళిపోయిందా ఇంక నేను మిగిలాను అన్నారు. ఎచ్చమ్మాళ్ మీకు అన్నం పెట్టేది కదా నేను కూడా ఎచ్చమ్మాళ్ లాగ అన్నం పెడతాను అని ఒకరు అంటే అది ఆవిడ సొమ్ము మాత్రమే. మీరు అన్నం పెట్టవచ్చు కాని ఆ ఆప్యాయత, ఆ మధురస్వభావం, ఆ గురుభక్తి మీకు ఎలా వస్తాయి అన్నారు. జ్ఞాని

ప్రెజన్స్‌లో మీరు ఆయన అయిపోతారు, జ్ఞాని యొక్క వైభవం అటువంటిది.

నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అనుకోవటానికి నువ్వు అంటూ ఒకడవు ఉన్నావా? నువ్వు తినేది ఈశ్వరుడిది, నువ్వు ఇతరులకు ఇస్తే అది ఈశ్వరుడిది, ఇతరులు ఇస్తే నీవు పుచ్చుకొనేది ఈశ్వరుడిది. నీకు సొంతం అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు అంతా ఈశ్వరుడిదే. ఈ విశాలమైన సృష్టిలో నీది అంటూ ఒక్క గడ్డిపరక కూడ లేదు. సత్యాన్ని దర్శించిన వాడు చెప్పిన మాట ప్రమాణం అంతేగాని దేహబుద్ధి ఉన్నవాడు చెప్పిన మాట ప్రమాణం ఎలా అవుతుంది. దేహాభిమానం ఉన్నవాడు ఏదైతే చెపితే చెప్పవచ్చు కాని అది శాస్త్రం అవుతుందా? ఇష్టం ఉన్నప్పడు ఒకలాగ, ఇష్టం లేనప్పడు ఒకలాగ మాటలు చెపితే అది శాస్త్రమా? నువ్వు ఇలా చేస్తే నీకు జ్ఞానం కలుగుతుంది అని శాసించేది శాస్త్రము. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో నిలబడేది శాస్త్రం. నిజమైన గురువు నీ లోపలే ఉన్నాడు. ఆయన రూపరహితుడు, నామరహితుడు, కర్మరహితుడు, జన్మరహితుడు, వాడిని నీవు అర్థం చేసుకోలేవు. దేహాభిమానం ఉన్న నీవు దేహాభిమానం ఎలా ఉంటుందో తెలియనివాడిని ఎలా అర్థం చేసుకోగలవు, అది సాధ్యం కాదు. అందుచేత ఆయనకు అవసరం లేకపోయినా నీకోసం దేహం ధరించివస్తాడు, వాడు గురువు. వారు దేహంలో ఉన్నప్పడు కూడా ఆ దేహంతో నాకు సంబంధం లేదని వారికి తెలుసు. మనకోసం దేహం ధరించి మనతో కలిసితిరుగుతూ, సన్నిహితంగా ఉంటూ, అన్నం తిన్నావా, ఆరోగ్యం బాగా ఉందా, ఏదైనా సాధన చేసుకొంటున్నావా అంటూ మన స్థాయికి దిగివచ్చి మనకు తెలియకుండా మన మనస్సును హృదయగుహలోనికి గెంటేస్తాడు వాడు గురువు. గురువు శరీరం ఎక్కడ ఉన్నా ఇబ్బంది లేదు, ఆయనతో నీకు మానసికఅనుబంధం ముఖ్యం. కొంతమంది పెద్ద సాధన చేసినట్లు కనబడరు, మామూలుగా మనలాగే ఉంటారు, వారికి జ్ఞానం వచ్చేస్తుంది, గురుపాదాల మీద వారికి ఉన్న భక్తి వలన జ్ఞానం వచ్చేస్తుంది. మనం తరించటానికి గురువు యొక్క మాట చాలు, ఆయన చూపు చాలు, ఆయన పాదాలయందు భక్తి చాలు. తాబేలు నీటిలో ఈదుతూ ఉంటుంది, దాని గుడ్లు భూమి మీద పెడుతుంది. అది నీటిలో తిరుగుతూ ఉన్నా దాని మనస్సు అంతా భూమి మీద ఉన్న గుడ్లు మీద ఉంటుంది. అలాగే మీరు ఇంటిదగ్గర ఎన్ని పనులు చేసుకొంటున్నా మీ మనస్సు భగవంతుడి పాదాల మీద పెట్టండి అని రామకృష్ణుడు చెప్పారు. మీ మనస్సు భగవంతుని పాదాల మీదుంటే మీ మనస్సు బంగారం అవుతుంది, మీ మాట బంగారం అవుతుంది, మీ

ప్రవర్తన బంగారం అవుతుంది, మీ చేత బంగారం అవుతుంది, చివరకు మీరు బంగారం అవుతారు. అంటే పరమపవిత్రులవుతారు, అది శుద్ధ చైతన్యం. నీకు గురువుతో లోపల సంబంధం ఉన్నప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నా, ఏ జన్మలో ఉన్నా ఏమీ ఇబ్బంది లేదు. గురువు సర్వజ్ఞుడు, అంతర్యామి. నీ మొఖాన్ని ఎప్పడు, ఎలా మలుపు తిప్పాలో, నిన్ను ఎలా బాగుచేయాలో ఆయనే చూసుకొంటాడు.

సుఖం ఒక్క ఆత్మలో తప్పించి ఎక్కడా లేదు, ఎక్కడైనా ఉంది అనుకొంటే అది మీ అజ్ఞానానికి గుర్తు. మీకు ఏదైనా దుఃఖం వస్తూ ఉంటే, భయం వస్తూ ఉంటే, వేదన వస్తూ ఉంటే మీ లోపల ఉన్న అజ్ఞానం యొక్క ఫలితాలు ఇవి అన్నీ. గురువు యొక్క మౌనం చాలు మీరు బాగుపడటానికి, మౌనం అతిశక్తివంతమైనది. వారిని ఉద్ధరించాలి, వీరిని ఉద్ధరించాలి అని గురువు అనుకోడు, అది జరిగిపోతూ ఉంటుంది, అది ఆటోమేటిక్ డివైన్ యాక్షన్. గురువు యొక్క సన్నిధి చాలు, ఆయన శరీరం ధరించి ఉన్నా చాలు మాటతో పని లేదు. మీరు సాధనలు చేయండి, పూజలు, జపాలు, ధ్యానాలు, యాత్రలు చేయండి. మంచిదే కాని ఇవి అన్నీ చేయలేని వారికి గురువు యొక్క పాదాలు చాలు. పూజలు చేయాలంటే, యాత్రలు చేయాలంటే డబ్బు ఉండాలి, గురువు పాదాలయందు భక్తి కలిగి ఉండటానికి ధనంతో పనిలేదు. పూజలు, జపాలు, ధ్యానాలు చేయటం వలన ఏ ఫలితం వస్తుందో గురువు యొక్క పాదాలను ఆశ్రయించటం వలన అదే ఫలితం వస్తుంది. నారాయణుడికి నమస్కారం అంటే ఓ నారాయణా! నువ్వు ఉన్నావు నేను లేను అని అర్థం. మనం ఉన్నాము అనుకొంటున్నాము కాబట్టి దుఃఖం వస్తోంది, మనం లేము అని తెలిస్తే దుఃఖం ఎవరికి వస్తుంది. నేను శాంతిగా ఉంటే ఈ పంచభూతాలు శాంతిగా ఉన్నట్లు నాకు అనిపిస్తుంది, మీరందరూ నాకు స్నేహితులుగా కనిపిస్తారు, లోకం అంతా శాంతితో ఊగుతున్నట్లు అనిపిస్తుంది. అది అలా ఎందుకు జరిగింది, ఇది ఇలా ఎందుకు జరిగింది అని మనం అనుకొంటాము, కాని జ్ఞాని ఇదంతా భగవంతుడి యొక్క లీల అనుకొంటాడు. నువ్వు భగవంతుడి యొక్క శక్తిని అర్థం చేసుకోగలవా? భగవంతుడి యొక్క వైభవాన్ని అర్థం చేసుకోగలవా? నువ్వు ఈ భూమి మీదకు వచ్చినందుకు ప్రయత్నం చేసి, సాధన చేసి భగవదనుభవం పొంది బయటకు పోవాలి, ఈ శరీరానికి మరణం రాకముందే నువ్వు పొందవలసింది పొంది వెళ్ళిపో. మీరు భగవంతుడు చెప్పిన మాట వింటున్నారు అనుకోండి,

మీరు ఆయన దగ్గరకు వెళ్ళటం కాదు, ఆయనే మీ దగ్గరకు వచ్చి మిమ్మల్ని స్వాధీనం చేసుకొని ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు, వాడు దేవుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-10-05, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

కొంతమంది పెద్దలు ఈ భూమి మీదకు వస్తారు. అప్పటి సమాజపరిస్థితులను బట్టి చెపుతూ, సమాజంలో ఉన్న లోటుపాట్లను సవరించి, తాత్కాలికంగా ప్రయోజనాలు చేసి ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోతారు. కాని రామకృష్ణుడు, గౌతమబుద్ధుడు, రమణ మహర్షి వీరు కేవలం ఒక కాలానికి, ఒక దేశానికి పరిమితమైనటువంటి వారు కాదు. వారి నోటిద్వారా ఒకమాట వస్తే అది దేశానికి అతీతంగా, కాలానికి అతీతంగా ఉంటుంది. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, కొండలు ఎంతకాలం అయితే ఉంటాయో, నదులు ఎంత కాలం ప్రవహిస్తూ ఉంటాయో వారి మాట కూడా అంతకాలం ఉంటుంది అంతేగాని ఇవాళ కొత్తగా ఉండి, నాలుగు రోజులకు పాతబడిపోయే మాటలు కాదు. బ్రాహ్మీస్థితిని పొందిన వారు మాత్రమే అలా చెప్పగలరు లేకపోతే అలా చెప్పటం సాధ్యం కాదు. దేహం నేను అనుకొనే వాడికి సుఖం ఉంది, దుఃఖం ఉంది, బంధం ఉంది, మోక్షం ఉంది, దేహము నేను అనే వాడిని తీసి ఒకప్రక్కన పెడితే పుట్టుక లేదు, చావు లేదు, సుఖం లేదు, దుఃఖం లేదు, బంధం లేదు, మోక్షం లేదు. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో ఆ నేను ఎవరు అని ప్రశ్నించుకొనే అలవాటు ఇంకా మనకు రాలేదు. కనిపించిన వారినల్లా మీరు ఎవరు అని అడుగుతాము, ఇతరుల గురించి వివరాలు సేకరిస్తాము కాని ఈ నేను ఎవరు అని ప్రశ్నించి, దీని గురించి సమాచారం తెలుసుకోవటం లేదు. ఇది మన అజ్ఞానానికి పరాకాష్ట. నేను సమాజాన్ని ఉద్ధరిస్తాను అంటావు మంచిదే. ఈ ఉద్ధరిస్తాను అనే నేను ఎవరు? మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది దేహగతమైనది, మనోగతమైనది, ఇంద్రియగతమైనది, ఇది సత్యం కాదు, దేహం ఎంత నిజమో, ఈ లోకం ఎంత నిజమో, పుణ్యపాపములు స్వర్గ నరకములు ఎంతనిజమో మనం అనుకొనే నేను కూడా అంతే నిజం. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని దేహం అనుకోదు, దేహానికి భిన్నంగా ఉన్న నేను అనుకొంటుంది. ఆ నేను ఎంత నిజమో ఈ దేహానికి వచ్చే చావు కూడా అంతే నిజం. ఈ నేనును ప్రశ్నించగా ప్రశ్నించగా అది ఎక్కడనుండి ఉదయించి వచ్చిందో అక్కడకు ఉపసంహరింపబడుతుంది.

ఈ నేను అనే తలంపు మన లోపల నుండి వస్తోంది కాని అది ఎక్కడ నుండి వస్తోందో మనకు తెలియటం లేదు. ఆ స్థానం నీవు తెలుసుకోగలిగితే నీకు జ్ఞానం కలుగుతుంది, నీవు బంధంలో నుండి మోక్షం లోనికి వస్తావు, ఇవి కాలక్షేపణ మాటలు కాదు, నగ్నసత్యాలు.

మనకు భయం ఉంది, రాగద్వేషాలు ఉన్నాయి, కపటం ఉంది, ఈ కనిపించే నామరూపాలు మాత్రమే నిజం, ఈ నామరూపాలకు అతీతంగా ఏమీ లేదు అనుకొంటున్నాము. అందుచేత లోపలఉన్న సద్వస్తువు మనకు ఎరుకలోనికి రావటం లేదు. నీ కపటమైన మనస్సుకా లోపలఉన్న సత్యవస్తువు తెలిసేది? మనకు న్యూస్‌పేపరు మీద ఉన్న గౌరవం కూడా భగవంతుడు చెప్పిన మాట మీద లేదు ఎందుచేతనంటే మన బుద్ధి మంచిది కాదు. మనం బాగుపడటానికి భగవంతుడు ఎన్నో మాటలు చెప్పాడు కాని అవి మనకు చేదుగా, విషపూరితంగా కనిపిస్తున్నాయి. మన మనస్సు అణిగిపోతే మనద్వారా సమాజానికి మేలు జరుగుతుంది. మనకు అర్హత లేకుండా ఏదో సమాజాన్ని ఉద్ధరించాలి అంటే అది సాధ్యం కాదు. భగవంతుడు మనకు కొన్ని శక్తులు ఇచ్చాడు, వాటిని మనం జాగ్రత్తగా ఉపయోగించు కోవాలి. కొంతమంది ఉన్నతంగా ఆలోచిస్తారు. మన ఆలోచన ఎప్పుడూ మంచివైపు ఉండాలి గాని చెడువైపు ఆలోచించకూడదు. మంచివైపు ఆలోచిస్తూ ఉంటే మన బుద్ధి శుద్ధి అవుతుంది. మనకు ఉన్న చదువును మంచికి ఉపయోగిస్తే దానివలన మనకి శక్తి పెరుగుతుంది. మనకు ఉన్న ధనాన్ని మంచికి ఉపయోగిస్తే భవిష్యత్‌లో ధనం పెరుగుతుంది, చెడ్డకు ఉపయోగిస్తే ఉన్న ధనం పోతుంది, చివరకు దారిద్ర్యం మిగులుతుంది. మనకు ఉన్న డబ్బును, చదువును, మన బుద్ధిని జాగ్రత్తగా ఉపయోగించుకొంటూఉంటే మనం అభివృద్ధి అవుతాము, సరిగా ఉపయోగించుకోకపోతే అవే మనలను పాడుచేస్తాయి, జీవించి ఉండగానే శవాలకింద అయిపోతాము.

ఈశ్వరుడు రూపరహితుడు, నామరహితుడు. ఆయన పనిచేస్తూ ఉంటాడు కాని పని చేస్తున్నట్లు మీకు కనిపించడు. నీ కళ్లకు కనిపించటం లేదని, నీ బుద్ధికి అందటం లేదని ఆయన లేడు అనుకోవద్దు. నువ్వు ఎంత? నీ జీవితం ఎంత? నీ తెలివి ఎంత? ఈ గోడ ప్రక్కన ఏముందో నీకు తెలియదు, ఇంకో గంటలో ఏమి జరుగుతుందో నీకు తెలియదు, నువ్వా ఈ సృష్టి గురించి ఆలోచించేది. సీలింగ్ ఫ్యాన్ స్పీడుగా తిరుగుతూ ఉంటే దాని రెక్కలు కనబడవు, రెక్కలు కనబడటం లేదు అని ఫ్యాన్ తిరగటం లేదు అని అర్థం కాదు.

అదే విధంగా ఈశ్వరుడు నీ కళ్లకు కనబడనంత వేగంగా, నీ బుద్ధికి అందనంత వేగంగా పనిచేస్తున్నాడు. నీ బుద్ధికి అందటం లేదు అని ఆయన పనిచేయటం లేదు అని నీవు అనుకోకు. ఆయన చేసే పని నిర్మలంగా, సైలెంట్‌గా చేస్తాడు. నీ గుర్తింపులతో పని లేకుండా చేస్తాడు, వాడు ఈశ్వరుడు. ఈ మధ్య మమ్మల్ని అశాంతి పీడించేస్తోంది అని కొంతమంది అంటారు. పూర్వ జన్మలలో మనం పవిత్రంగా జీవించకపోతే, వివేకవంతంగా జీవించకపోతే, సత్కర్మలు చేసి ఉండకపోతే అదే మనలో అశాంతిగా, దుఃఖంగా స్మశానంకు వెళ్లేవరకు మనలను పీడిస్తుంది.

నరేన్ నాలుగు రోజులు కనబడకపోతే నీటిలో ఉన్న చేపను గట్టుమీద వేస్తే గిలగిలా ఎలా కొట్టుకొంటుందో అలాగ ఉండేది రామకృష్ణుడికి, అది జన్మాంతర అనుబంధం. పూర్వ జన్మలలో అనుబంధం ఉంటే మీ శరీరాలు శవం అయ్యేవరకు ఆ స్నేహం అలా కొనసాగుతుంది, అనుబంధం లేకపోతే ఏదో పాయింట్‌లో బ్రేక్ అయిపోతుంది. జ్ఞానం అంటే ఏమిటి అని రామకృష్ణుడు నరేన్‌ను అడుగుతున్నాడు. నరేన్ అలా చూస్తున్నాడు. మనకు తెలియనది ఆయనకు తెలుస్తోంది అని గుర్తిస్తున్నాడు. జ్ఞానం అంటే ఒక్క మాటలో చెప్పాడు రామకృష్ణుడు. ఓ భగవంతుడా! నువ్వే కర్తవు, నేను అకర్తను అన్నాడు. ఇదీ జ్ఞానం అంటే. దేహం కనుక నువ్వు అయితే నువ్వు కర్తవే, కాని నీవు దేహం కాదు అయినా నువ్వే కర్తను అనుకొంటున్నావు అందుకే నిన్ను దుఃఖం వెంటాడుతోంది. దేవుడు లేడు అంటున్నావు. నీ ఇష్టాయిష్టాలమీద ఆయన ఆధారపడిలేడు. నీకు కోపం వచ్చి దేవుడు లేడు అనవచ్చు అంత మాత్రంచేత ఉన్న దేవుడు ఎక్కడికి పోడు. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు, లేని దానికి ఉండటం అంటూ లేదు, ఉన్న దానికి లేకపోవటం అంటూ లేదు. కాని ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా నీకు కనిపిస్తోంది, దానినే మాయ అంటారు నరేన్ అని చెప్పాడు. లోపల చైతన్యం ఉంది. మనం సాధన చేసేటప్పుడు అది వేరు, మనం వేరు అనుకొని సాధన చేస్తాము. అది అనుభవైకవేద్యం అయ్యాక అదే నేను అని నీకు తెలుస్తుంది, అప్పుడు వాడు సంసారంలో నుండి బయటపడతాడు, వాడే జ్ఞాని. నేను పుట్టాను, నేను చనిపోతున్నాను అనుకొనేవాడు ఎవడూ జ్ఞానికాదు.

కృష్ణుడు గీత చెప్పేటప్పుడు నేను, నేను అంటే అది మనం అనుకొనే నేను కాదు, అంతటా వ్యాపించిన వస్తువు ఏదైతే ఉందో ఆ చైతన్యమే నేను నేను అని చెపుతోంది. అంతే గాని అక్కడ దేహమాత్రుడు కాదు. మనం నేను అనేటప్పటికి ఒక రూపం తోటి, నామం తోటి

తాదాత్మ్యం పొందుతాము. మనకు వంద సంవత్సరాలు వయస్సు వచ్చినా ఏమీ సాధన లేకపోవటం వలన ఈ కనిపించే నామరూపాలు నూటికి నూరుపాళ్ళు అసత్యం అనే బుద్ధి మనకు రావటం లేదు. మనం ఏదైనా ఒక పనిచేసేటప్పుడు ఒక రూపాన్ని, ఒక నామాన్ని పెట్టుకొని చెయ్యకూడదు. ఇది ధర్మం అనుకొన్నప్పుడు ఆ పని చెయ్యటమే. అంతేగాని రూపాన్ని, నామాన్ని పట్టుకొని మనం పనిచేస్తూ ఉంటే ధర్మమార్గంలో ప్రయాణం చేయలేము, హృదయంలో ప్రవేశించలేము, మోక్షసుఖాన్ని పొందలేము. నువ్వు రాగ ద్వేషాలు లేకుండా, ఇష్టాయిష్టాలు లేకుండా నీ ఇంద్రియాలతో ఒకవేళ విషయాలను గ్రహిస్తున్నా నీ శాంతి చెదిరి పోదు, నీ సుఖం చెదిరిపోదు అని భగవంతుడు చెపుతున్నాడు. మీరు ఏదైనా ఒక పని సాధించాలి అనుకొన్నప్పుడు మీ ప్రయత్నం మీరు చేస్తూ అందరి సహకారం తీసుకోండి. మీరు ధనం సంపాదించాలి అనుకొంటున్నారు, అది ఒక పని అనుకొంటున్నారు. కష్టపడి చదువుకొంటున్నారు. అది ఒక పని అనుకొంటున్నారు. కీర్తిని సంపాదించాలి అనుకొంటున్నారు. అది ఒక పని అనుకొంటున్నారు. అయితే మనస్సును పవిత్రం చేసుకోవటం, ఏకాగ్రం చేసుకోవటం అది మటుకు పనికాదు అనుకొంటున్నావా? నిన్ను నీవు బాగు చేసుకోవటం పని కాదా? అని భగవంతుడు అడుగుతున్నాడు. భగవంతుడు చాలా గొప్పవాడు అని కొంతమంది నోటితో పొగుడుతూ ఉంటారు కాని ఆయన చెప్పిన మాటలు వినరు. ఇటువంటి వారిని చూసి భగవంతుడు మోసపోడు. మనం సమాజాన్ని మోసం చేయవచ్చు గాని భగవంతుడిని మోసం చేయలేము. మనలో ఏమి ఉందో మనకు తలంపు వచ్చాక తెలుస్తుంది, తలంపు రాకముందే మనలో ఏమిఉందో ఆయనకు తెలుస్తూ ఉంటుంది, ఆయన సర్వసాక్షి, సర్వదర్శి.

నువ్వు ద్వేషాన్ని ఆశ్రయించకు, ప్రేమను ఆశ్రయించు. అసత్యాన్ని ఆశ్రయించకు సత్యాన్ని ఆశ్రయించు, అధర్మాన్ని ఆశ్రయించకు ధర్మాన్ని ఆశ్రయించు. ఏవో తాత్కాలిక ప్రయోజనాల కోసం ధర్మాల్ని విడిచిపెట్టవద్దు. నువ్వు ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉంటే నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు తానుగా ఎరుకలోనికి వస్తుంది. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు. మనం హృదయం యొక్క లోయలోనికి దిగలేక పుస్తకాలలోను, బయట ప్రకృతిలోను దేవుడికోసం వెతుకుతున్నాము. దయలో నుండి ప్రేమ పుడుతుంది, భక్తిలోనుండి జ్ఞానం పుడుతుంది. దయలేనివాడు ఈ సమాజాన్ని ప్రేమించలేడు. నేను ఎవరికైనా సహాయ సహకారములు అందిస్తే వారిని ఉద్ధరించటానికి కాదు, నన్ను నేను

ఉద్ధరించుకోవటానికి చేస్తున్నాను అని లింకన్ అనేవాడు. ఆహారం విషయంలో, విహారం విషయంలో జాగ్రత్తగా ఉండు. కొంతమంది అన్నం తిన్న వెంటనే మంచం మీద పడిపోతారు. మనం అన్నం ఎంత తినాలి అంటే అన్నం తినకముందు ఏ పని చేసుకొంటున్నామో అన్నం తిన్న తరువాత కూడా ఆ పని చేసుకొనేటట్లుగా ఉండాలి, అంతేగాని మత్తు వచ్చి మంచం మీద పడిపోయేలా తింటే ఎలాగ? కొంతమంది ఎంతసేపు పని నొల్లుకొంటూ ఉంటారు, 24 గంటలు వారి స్వార్థం చూసుకొంటూ ఉంటారు. నువ్వు 24 గంటలు ఏదోపని నొల్లుకుంటూ ఉంటే నువ్వు సాధన ఎప్పుడు చేస్తావు, జపధ్యానములు ఎప్పుడు చేస్తావు. భగవదనుభవం ఎప్పుడు పొందుతావు. 24 గంటలు పనిచేసి నీ స్వార్థాన్ని నెరవేర్చుకొంటావు ఇంక నీ జీవితంలో సాధించింది ఏమిటి? నీకు మిగిలేది ఏమిటి? అది కూడా ఆలోచించుకో. మీ పనులు మీరు చేసుకోవచ్చు. అతి పనికి రాదు, మధ్యేమార్గంలో ఉండాలి. మేము 24 గంటలు బిజీగా ఉన్నాము అని కొంతమంది అంటూ ఉంటారు మరి చావు వస్తే ఆగుతుందా? ఒక్క క్షణం కూడా ఆగదు. ఏమి సాధించటానికి నీవు బిజీగా ఉన్నావు. లోకాన్ని ఉద్ధరించటానికి బిజీగా ఉన్నావా? నీ మనస్సును పవిత్రం చేసుకోవటానికి బిజీగా ఉన్నావా? నీ బుద్ధిని బాగుచేసుకోవటానికి బిజీగా ఉన్నావా? లేకపోతే నీ కోరికలు నెరవేర్చుకోవటానికి బిజీగా ఉన్నావా? దేనికి బిజీగా ఉంటున్నావో చూసుకో.

మీ దేహప్రారబ్ధంలో డబ్బు ఉంటే ఉండనివ్వండి, పదవులు ఉంటే ఉండనివ్వండి, వంద పి.హెచ్‌డిలు ఉంటే ఉండనివ్వండి కాని నీ సుఖం కోసం, శాంతి కోసం వాటి మీద ఆధారపడితే నీకు చివరకు మిగిలేది విషాదం, అశాంతి, నరకం. అందుచేత నీ సుఖం కోసం, శాంతి కోసం ఇతరుల మీద ఆధారపడితే, బాహ్యపరిస్థితుల మీద ఆధారపడితే మీ శాంతి అంతా ఏ నాటికైనా అశాంతిగా మారిపోతుంది, ఇది గుర్తు పెట్టుకోండి. సూర్యుడు ఉన్నప్పడు చీకటి ఉండదు అలాగే స్వయం ప్రకాశమైన ఆత్మ సమక్షంలో అవిద్య ఉండదు, అశాంతి ఉండదు, దుఃఖం ఉండదు. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణించు, భక్తిమార్గం జ్ఞానమార్గం కర్మమార్గం నీ మనస్సుకు ఏది అభిరుచి ఉంటే ఆ రకంగా సాధన చేసుకో. నీకు అహంభావన ఉన్నంతకాలం, ఆడంబరం ఉన్నంతకాలం, అసత్యంలో కూరుకొనిపోయి ఉన్నంతకాలం నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ఈ మాటలు మీకు నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు కాని ఇది సత్యం. ఎవరినో సంతృప్తి పరచటానికి చెప్పిన మాటలు కాదు. భగవంతుడు

చెప్పిన మాట మీద మనకు నమ్మకం, విశ్వాసం కలగాలి, అప్పుడు శ్రద్ధ వస్తుంది, శ్రద్ధలో నుండి జ్ఞానం వస్తుంది. మనకు శ్రద్ధ ఉంటే ఏదైనా సాధించగలము. నాకు టెన్షన్ వస్తోంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నేను కర్తను అని అనుకోవటం వలన టెన్షన్ వస్తోంది, భగవంతుడే కర్త అని నూటికి నూరుపాళ్ళు నీకు అర్థమయితే టెన్షన్ అనే సమస్య లేదు, మీరు మెంటల్ డాక్టర్ల దగ్గరకు వెళ్ళనక్కరలేదు. మీరు మెంటల్ డాక్టర్ల దగ్గరకు వెళితే ఏవో మందులు ఇస్తారు, 10 రోజుల్లో తగ్గుతుంది, మరల మానసిక అనారోగ్యం రిపీట్ అవుతుంది. మీరు సబ్జక్టును క్లోజ్‌గా అర్థం చేసుకొంటే నిప్ప మీద నీరు పోస్తే వెంటనే ఎలా ఆరిపోతుందో అలాగ మీ టెన్షన్, మీ అశాంతి అప్పటికప్పడే ఆగిపోతాయి. అన్నం వండుకోవటం, ఇల్లు తుడుచుకోవటం ఇవి మాత్రమే పనులు కాదు నామం స్మరించటం, ధ్యానం చేయటం, విచారణ చేయటం ఇవి అన్నీ కూడా పనులే అన్న సంగతి మర్చిపోవద్దు. ఇవి అన్నీ ఎందుకు అంటే మనం పవిత్రులం అవ్వటానికే. నేను జ్ఞానం సంపాదిస్తే నా వలన ఇతరులకు ఏమైనా సహాయ సహకారములు అందుతాయా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. తప్పనిసరిగా అందుతాయి, ఇందులో నీకు సందేహం ఎందుకు? నీకు జ్ఞానం కలిగితే, నీకు శాంతి ఉంటే నీ ద్వారా ఇతరులకు సహాయ సహకారములు అందుతాయి.

నువ్వు ఏ వస్తువునయితే తెలుసుకోవాలి అనుకొంటున్నావో దానిని శరణు వేడుకో. అది నీ కంటే దూరంగా లేదు. నీ కాళ్ళకంటే, నీ చేతుల కంటే, నీ తలకాయకంటే అతి దగ్గరగా నీలోనే ఉంది. మనకు పైన చర్మం కనబడుతోంది, దాని లోపల మాంసం, ఆ మాంసం లోపల ఎముకలు ఉన్నాయి. ఆ ఎముకల లోపల ఎక్కడో హృదయాంతరాళాలలో భగవంతుడు అంతర్యామిగా ఉన్నాడు. నీకు తెలియవచ్చు, తెలియకపోవచ్చు. నీకు తెలియనంత మాత్రం చేత ఉన్నవాడు లేకుండా పోడు. ఆయన సర్వసాక్షిగా ఉన్నాడు. ఆయన దయ పొందటంకోసం, ఆయన అనుగ్రహం కలగటం కోసం నువ్వు ఏదైనా ఒక్కపని అయినా చేసావా? కనీసం ఒక్కమాట అయినా మాట్లాడావా? ఎందుకు ఈ వ్యర్థమైన ఆలోచనలు, తలంపులు, కోరికలు. మన ఇంట్లో ఉన్న వ్యక్తులను సంతోషపెట్టటానికి మనం చాలా పనులు చేస్తాము, చచ్చే వరకు మనకు అదే పని. భగవంతుని అనుగ్రహం పొందటం కోసం కనీసం చిన్నపని అయినా చేస్తున్నావా? అది చూసుకో. ఏమీ అక్కరలేదు. మీ ఇంట్లో వారిని

మీరు ఎలా ప్రేమిస్తున్నారో అలాగ దేశాన్ని ప్రేమించండి, మీరు ఈశ్వరుని దయకు పాత్రులవుతారు. మీ ఇంట్లో వారు మిమ్మల్ని కొడతారు అనుకోండి అయినా వారిని ప్రేమించటం మానరు, దానికి వారి మీద ఉన్న మమకారం కారణం. మీరు వారి కోసం వేలాది ఎకరాలు సంపాదించి ఇస్తే నీ కోరికలు నెరవేర్చుకోవటం కోసం మాకు ఏదో సంపాదించి పెట్టావు అంతేగాని మమ్మల్ని ఉద్ధరించావు అని మేము అనుకోవటం లేదు అని అలా తిరస్కారంగా మాట్లాడేవారు కూడా ఉన్నారు. అది డివైన్ నేచర్‌కాదు, డివైన్ నేచర్ ఉన్నవారు అలా మాట్లాడరు. అది హ్యూమన్ నేచర్.

నీ అహంకారాన్ని సంతృప్తిపరచటానికి చాలా పనులు చేస్తున్నావు. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడి దయ సంపాదించటానికి నీవు ఏమైనా చేస్తున్నావా? నీ జీవితవిధానం ఎలా ఉండాలి అంటే అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడి దయ సంపాదించటానికి అనుగుణంగా నీ జీవితాన్ని తీర్చి దిద్దుకో. నీకు ఆలోచన వస్తే వాడి అనుగ్రహాన్ని సంపాదించటానికి రావాలి, నీవు చేతితో ఏదైనా పనిచేస్తే ఆయన అనుగ్రహాన్ని సంపాదించటానికి చెయ్యి. అప్పుడు నీకు శాశ్వతమైన సుఖం, శాంతి దొరుకుతాయి. మనకు డబ్బు ఉంటే అది అనుభవించే కొలది తరుగుతుంది కాని ఈ శాంతి అనుభవించే కొలది పెరుగుతుంది. మీకు చెవులు ఉన్నాయి కాబట్టి ఈ మాటలు వినండి, బుద్ధి ఉంది కాబట్టి ఆలోచించండి. మీకు ఇష్టం లేకపోతే ఊసేయండి, మీరు ఊసేసినా కాని భగవంతుడు చెప్పిన మాటలు సత్యం. నీవు స్వీకరించినా, ఆ మాటలను నీవు రిజక్టు చేసినా ఆయనకు వచ్చే నష్టం ఏమీ లేదు. లాభం, నష్టం, గౌరవం, అగౌరవం ఇవి అన్నీ జీవుడికే, భగవంతుడికి ఇవి ఏమీ లేవు. జీవలక్షణాలు ఉన్న నీకు భగవంతుడు చెప్పిన మాటలు అర్థంకావు. నిన్ను నీవు మర్చిపోయి ఎప్పుడైనా ఎవరినైనా ప్రేమించావా? దయ, ప్రేమ ఎలా ఉంటాయో నీకు తెలుసా? ఇవి ఏమీ తెలియని నువ్వు ఈశ్వరుని దయకు ఎలా పాత్రుడవు అవుతావు. నువ్వు తినే అన్నం నీకు అనారోగ్యం తీసుకొని రాకూడదు, ఆరోగ్యాన్ని ఇవ్వాలి. అలాగే నీవు చేసే సాధన నీకు అశాంతిని తీసుకొని రాకూడదు, శాంతిని ఇవ్వాలి.

భగవద్గీత చదువుకోవాలని ఉంది కాని మాకు టైము లేదు అని కొంతమంది అంటారు. గాంధీగారు కొన్ని కోట్లమంది వ్యవహారాలు చక్కబెడుతూ కూడా రోజూ గీత చదువుకోకుండా బయటకు వచ్చేవారు కాదు. ఆయనకు టైము ఉంది కాని మీకు టైము లేదా? గాంధీగారికంటే

మీరు బిజీగా ఉన్నారా? టైము లేదు అని చెప్పవద్దు మాకు శ్రద్ధ లేదు అనిచెప్పండి. మనకు తరచు భయం వేస్తోంది అనుకోండి లోపల ఏదో కోరిక ఉంది. కోరిక ఉన్నవాడికి భయం, దుఃఖం, అశాంతి వస్తాయి, కోరిక లేనివాడికి ఏమీ లేదు. అయితే కోరిక ఎక్కడ నుండి వస్తోంది అంటే దేహగతమైన నేనులోనుండి కోరికలు వస్తున్నాయి. ఆ గెడపదాటితే కోరికలు లేవు. దేహమే నేను అనే బుద్ధిలోనుండి బయటకు వస్తే వాడికి ఎటు చూసినా శాంతే, ఎటుచూసినా ఆనందమే. మీరు జ్ఞానం సంపాదిస్తే ఇతరులకు పంచి పెట్టకుండా ఎలా ఉండగలరు. మీ ఇంటి తలుపులు వేసుకొని లోపల కూర్చొని సమాజ శ్రేయస్సు కోసం హృదయపూర్వకంగా ప్రార్థించండి, మీ తలంపు ఆ తలుపులను గెంటుకొని బయటకు వచ్చి సమాజంలోకి ప్రవహిస్తుంది, మంచితలంపు యొక్క ప్రభావం సమాజం మీద ఉంటుంది. మంచితలంపుకే ఇంత ప్రభావం ఉన్నప్పడు అలౌకికమైన శాంతి, అలౌకికమైన ఆనందానికి ఇంక ఎంత ప్రభావం ఉంటుందో చూడండి. నేను చేస్తున్నాను అనే తలంపు ప్రక్కన పెడితే వాడి ద్వారా సమాజానికి శాంతి అందుతుంది, ఆనందం అందుతుంది. మనం డబ్బు పెట్టి కొనుక్కోలేని వస్తువు ఒక్కటే ఉంది, అది శాంతి. ప్రపంచంలో ఉన్న సంపద అంతా కలిపినా అది శాంతితో సమానం కాదు. మన కుడిచెయ్యి ఎడమ చెయ్యికి ఏదైనా ఇస్తుంది అనుకోండి, నేను దానం చేసాను అని కుడిచెయ్యి అనుకోదు ఎందుచేత కుడిచెయ్యి, ఎడమచెయ్యి నాదే. జ్ఞానికి సమాజంతో అటువంటి తాదాత్మ్యం ఉంటుంది.

నాకు జ్ఞానం సంపాదించాలని ఉంది, దానికి ఆటంకాలు ఏమిటి అని అడిగితే నువ్వు జ్ఞానం సంపాదించటానికి నీ కుటుంబ సభ్యులు ఆటంకం కాదు, సమాజం ఆటంకం కాదు, ఆటంకాలు బయట ఏమీ లేవు. నీకు జ్ఞానం కలగకుండా నీకు నువ్వే అడ్డు వస్తున్నావు, అది నీకు తెలియటం లేదు. మీకు ఎవరికైనా తలనొప్పి వస్తే నాకు ఎర్రచీమ కుట్టినట్లుగా కూడా ఉండదు, అదే మా ఇంట్లో వారికి ఎవరికైనా తలనొప్పి వస్తే కంగారు పడిపోతాను. ఇటువంటి వేరుబుద్ధి ఉన్న వాడికా జ్ఞానం కలిగేది. మనకు మోక్షం ఇవ్వాలి అనుకొన్నప్పడు వీడికి లోపల ఏదైనా రూపంతోగాని, నామంతోగాని తాదాత్మ్యం ఉందా, లేకపోతే లోపల వ్యక్తిభావన ఉందా అని చూసుకొంటాడు. ఇవన్నీ రహితమైతే నీవు అడగకుండానేనీకు మోక్షాన్ని ఇస్తాడు, వాడు దేవుడు. గౌతమబుద్ధుడు రాజ్యాన్ని విడిచిపెట్టాడు, సంసారాన్ని, సర్వభోగాలను విడిచిపెట్టాడు. జ్ఞానాన్వేషణకు అడవిలోనికి వచ్చాడు. అయ్యో ఇన్ని భోగాలను విడిచిపెట్టేసాను అనే తలంపు

కూడా ఆయనకు రాలేదు, వాడు బుద్ధుడు. మనం ఏమీ విడిచిపెట్టనక్కరలేదు, ఎవరికైనా ఒక గ్లాసు మజ్జిగ పోస్తే చాలు అది చచ్చేవరకు మర్చిపోము, ఇటువంటి పాడుబుద్ధికా జ్ఞానం కలిగేది? మీరు ధనమే ప్రధానం అనుకొని జీవిస్తారు అనుకోండి, జీవించండి కాని మీరు సంపాదించిన ధనం అంతా దెయ్యం కింద మారిపోయి మిమ్మల్ని తరుముతుంది అని చెప్పాడు. బ్రహ్మంకు భిన్నంగా నేను ఉన్నాను అనుకొన్నప్పుడు అరణ్యాలకు వెళ్లి నీవు రోజుల తరబడి, సంవత్సరాల తరబడి జపాలు, ధ్యానాలు, తపస్సులు చేసినా నిన్ను అశాంతి విడిచిపెట్టదు, దుఃఖం విడిచిపెట్టదు అని చెప్పాడు. మీరు ఎవరిని చూసినా మనస్సుతో చూడకండి, జ్ఞానంతో చూడండి. మీకు హెచ్చుతగ్గులు పోతాయి, పోవటమే కాదు మీరు బతికి ఉన్న నాలుగురోజులు దుఃఖం లేకుండా బతకవచ్చు. నీకు జ్ఞానం కలుగకుండా నీలోని బలహీనతలు, రాగద్వేషాలు నీ మనస్సులో ఉన్న పెంట అంతా అడ్డువస్తోంది. ఎవరో బయటవారు అడ్డువస్తున్నారు అనుకోవటం నీ అజ్ఞానానికి గుర్తు. సత్పురుషుల సహవాసం లేకుండా, సద్గ్రంథ పఠనం లేకుండా, ఈశ్వరుని దయ లేకుండా ఒక్క వాసనలో నుండి కూడా నీవు బయటకు రాలేవు.

కొంతమంది మాకు చాలా సమస్యలు ఉన్నాయి అంటారు. ఈ సమస్యలను దేవుడు కల్పించలేదు, నీ మనస్సే కల్పించింది. ఫలానా దేహం నాది, ఫలానా పేరు నాది, ఫలానా పరిస్థితులలో నేను ఉన్నాను అని ఊహించుకోవటం వలన సమస్యలు వస్తున్నాయి. మనం ఎలా బతకాలి అంటే ఈ లోకంలోనికి వచ్చి వెళ్లిపోయిన గుర్తులు కూడా మనకు అక్కరలేదు. అలా గుర్తు లేకుండా వెళ్లిపోతే, ఆ రకంగా మనం జీవిస్తే ఈశ్వరుని దయకు పాత్రులవుతాము. అధ్యయనం అంటే ఆ గ్రంథం మనం చదవటం వలన మనకు శాంతి కలగాలి, జ్ఞానం కలగాలి, దేహం ఉన్నా దేహం లేనివాడితో సమానం అవ్వాలి. మనకు జ్ఞానం కలిగించే వాక్కులు కృష్ణుడి ముఖతః వచ్చినవి, ఆయనే గోవిందుడు. అచ్యుతుడు అంటే చ్యుతి లేనివాడు. ఈ దేహం ఉన్నా, లేకపోయినా, ప్రపంచం ఉన్నా లేకపోయినా గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా తన స్వరూపంలో నుండి, తన స్వభావంలో నుండి ఎవడైతే జారడో వాడే అచ్యుతుడు. అనంతుడు అంటే ఆది లేనివాడు, అంతం లేనివాడు, ఎప్పుడూ ఉండేవాడు, వాడే గోవిందుడు. మీరు తరించటానికి అచ్యుత, అనంత, గోవిందా ఈ మూడు నామాలు చాలు అని చెప్పాడు. నిద్రపోయేటప్పుడు ఈ మూడు నామాలు అనుకొంటే బాగా నిద్ర వస్తుంది, ఈ నామాలను స్మరిస్తూ స్మరిస్తూ ఉంటే మృత్యువు నుండి అమృతత్వంలోనికి వస్తారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 10-12-05 నుండి<br>19-12-05 వరకు | అరుణాచలం క్యాంపు, దీపోత్సవం |
| 23-12-05 శుక్ర | కాపవరం, గీతామందిరం |
| 14-01-06 శని | ఏలూరు, రామచంద్రరావు పేట, వెంకటేశ్వరస్వామి దేవస్థానం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**


# ప్రకటన



అనన్య భక్తులారా!

"సద్గురు దర్శనం" అన్న పేరుతో మహర్షి సద్గురు శ్రీ మలయాళ స్వాముల వారి జీవిత చరిత్ర టి.వి. సీరియల్‌గా 'మా టివి' ద్వారా 2005 నవంబరు 6వ తేదీ నుండి ప్రతి ఆదివారం ఉదయం గం॥ 8-30 ని॥ల నుండి గం॥ 9-00ల వరకు ప్రసారమగును. ప్రేక్షకులు గమనించి తప్పక వీక్షించగలరు.

**వివరములకు :**

**శ్రీ వ్యాసాశ్రమము**

(వయా) ఏర్పేడు - 517 621, చిత్తూరు జిల్లా

✆ 08578 - 287528, 9848542653

# నీతో చూడబడేది ఏదీ నిజం కాదు - నీవు నిజం

ఈ ప్రపంచం అనేది వెయ్యి అద్దాలు అమర్చిన భవనంలాంటిది. ఒక అద్దం నలుపు, ఒక అద్దం తెలుపు, మరొకటి పసుపు, ఆకుపచ్చ ఏ రంగులోంచి చూచినా ఆరంగే నిజమనిపిస్తుంది. బూతద్దంలోంచి చూస్తే ఆకారాలు, కురీపిగా, వికృతంగా కనిపిస్తాయి. అన్నిటిలోను అసలు సత్యం ఒక్కటే అది అఖండం, నిర్వికల్పం, శాశ్వతం అదే ఏకమై వెలుగొందుతోంది. స్వప్నాలలో మనం ఏ లైటు, ఏ సూర్యకాంతి సహాయం లేకుండా వస్తువులను చూస్తున్నాము. వెలుగు లేనిదే దేనిని చూడలేము? అయితే స్వప్నంలో ఏ వెలుగు సహాయంతో చూస్తున్నాము? అది మన ఆత్మ ప్రకాశం వలనే. చిన్మయానంద్ "చూచే నేను, చూడబడే ప్రపంచం చూచీ చూడటం అనే సంబంధం వలన సాధ్యమయ్యే అసంఖ్యాక కష్ట సుఖాలు కూడా అజ్ఞాన జనితాలే, చూచే నేను ఎవడు? చూడబడేది ఏమిటి? ఎలా చూడబడుతోందో, స్పష్టంగా తెలిపే జ్ఞానాన్ని సంపాదిస్తే యదార్థం బోధపడుతుంది. భ్రమ నశిస్తుంది" అన్నారు. మన దేహాత్మ బుద్ధి దృశ్యాన్ని నిజమనుకొనే భ్రాంతి తొలగనంత కాలం ఈ మనస్సు యొక్క కల్పనలు ఇలాగే సాగుతాయి. దీని పరిష్కారం సత్‌సంఘం చేస్తూ ఉండాలి. తత్త్వం అందనంతకాలం మనస్సు చేసే నీచ చేష్టలు ఇలాగే ఉంటాయి. నిద్రలో కలలు కంటాము, మెలకువ రానంతవరకూ అది నిజంగానే తోస్తుంది. మెలకువ వస్తే అందు కనబడే పులి, పాము వగైరాలు అన్నీ అసత్యాలని తేలిపోతుంది. అలాగే ఈ నిజ జీవితంలో జరిగే ప్రతి సంఘటనలు కలల వంటివే అంటారు జ్ఞానులు. సినీ తెరపై బొమ్మలు వచ్చి చిత్రంగా ఆడి వెళ్ళిపోతాయి, ఆ బొమ్మలు మాట్లాడుతాయి, నవ్వుతాయి, ఏడుస్తాయి. మనం ఆ దృశ్యాన్ని చూచి నిజమని భావిస్తాము. మొదట అది సినిమా అని తెలిసి కూడా మాయలో పడతాము. సినిమా పూర్తి అయితే బొమ్మలు ఉండవు. మనం మాత్రం మిగులుతాము. బొమ్మలను ఆడించే ప్రొజక్టరుకు ఇచ్చే శక్తి మొదట, మధ్య, చివరలో కూడా కనిపించదు. అలాంటిదే ఈ జనన మరణాల క్రీడ అంటారు పెద్దలు. ఈ సత్యాన్ని ఉన్నది ఉన్నట్లు తెలుసుకోవటమే తెలివికి సార్థకం. తెలుసుకొన్న ఈ నిజాన్ని తెలియచెప్పే గురుదేవుల మాటలను దృఢంగా నమ్మాలి. సంశయం గలవానికి నాశనం తప్పదు.

– సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం